


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 343 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 17 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :343 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 17 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# వరద పోటుకు దెబ్బతిన్న పోలవరం ప్రాజెక్ట్ ఎగువ కాఫర్ డ్యాం

## గత పది రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు

## పోలవరం ప్రాజెక్టుకు పోటెత్తిన గోదావరి వరద

## వరద తాకిడికి దెబ్బతిన్న ఎగువ కాఫర్ డ్యాం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వరదలు మరోసారి దెబ్బతీశాయి. గత పది రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్టులోని ఎగువ కాఫర్ డ్యాం పాక్షికంగా దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. వరద ఉద్ధృతికి కాఫర్ డ్యాంలో కొంత భాగం కోతకు గురైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి నదికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఈ తీవ్రమైన ప్రవాహం కారణంగా ఎగువ కాఫర్ డ్యాంకు సుమారు 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల లోతులో డ్యామేజ్ జరిగినట్టు తెలుస్తోంది.



కాగా, పోలవరం ఎగువ కాఫర్ డ్యాం దెబ్బతినడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2022 ఆగస్టు నెలలో వచ్చిన భారీ వరదలకు కూడా ఇదే తరహాలో డ్యాంకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే సమస్య పునరావృతం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దెబ్బతిన్న ప్రాంతంలో రిపేర్లు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.



# సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్

- సీఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని షర్మిల ఆరోపణ
- ఏడాది పాలనలో హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ధ్వజం
- ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు సాయం హామీలు గాలికి
- తల్లికి వందనం, రైతు పథకాలకు కోతలు పెట్టారని ఆరోపణ
- 14 నెలల తర్వాత బస్సు ఫ్రీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు 'సూపర్ ఫ్లాప్' అయ్యాయని, ఇది ప్రజలను ఘరానా మోసం చేయడమేనని ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. "సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యింది సీఎం చంద్రబాబు గారూ? 20 లక్షల ఉద్యోగాలు అన్నారు... ఒక్కరికైనా ఇచ్చారా? నెలకు రూ.3 వేల భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.15 వందలు అకౌంట్ లో పడ్డాయా? అన్నదాత సుఖీభవ కింద సొంతగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో లింక్ పెట్టారు. 30 లక్షల మంది రైతులకు పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారు. తల్లికి వందనం కింద 20 లక్షల మంది

వివరాలు 2లో..

# అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమే

- ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన జగన్
- ధర్మం నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతమని వ్యాఖ్య
- శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని ట్వీట్



**పెన్ పవర్ డెస్క్:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర ట్వీట్ చేశారు. అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమని ఆయన పేర్కొన్నారు. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతం అని చెప్పారు. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని అన్నారు. ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

వివరాలు 2లో..

# 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం
- సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం
- ఇది మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక అన్న నారా లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని మహిళలకు కానుకగా కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ...

వివరాలు 2లో..

# కుక్కల ప్రేమికులు పేదలను దత్తత తీసుకుని వీధులను కుక్కలకు వదిలేయాలి

- వీధి కుక్కలపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు
- దేశ వ్యాప్తంగా చర్చ
- కుక్కల ప్రేమికులను మరోసారి టార్గెట్ చేసిన వర్మ



**పెన్ పవర్ డెస్క్:**వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యల అనంతరం దేశవ్యాప్తంగా వీధికుక్కల దాడుల ఘటనలపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఈసారి ఆయన కుక్కల ప్రేమికులను లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన సంధించిన ప్రశ్నలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి."కుక్కలు మీకు

వివరాలు 2లో..

# ఏపీలో మరో అల్పపీడనం...

## రెండు అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు

- వాయువ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం
- రానున్న మూడు రోజులు కోస్తాంధ్రకు భారీ వర్షాలు
- రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు జల్లుల అంచనా
- మంగళవారం వరకు మత్స్యకారులకు వేటపై నిషేధం
- ఆదివారం పలు కోస్తా జిల్లాల్లో కుండపోత వర్షాలకు అవకాశం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక వర్ష సూచన జారీ చేసింది. వాయువ్య బంగాళాఖాతంలో ఆగస్టు 18, సోమవారం నాటికి మరో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం

వివరాలు 2లో..

# బీహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టిన రాహుల్ గాంధీ



- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓట్ అధికార్ యాత్ర' ప్రారంభం
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ తీవ్ర నిరసన
- 16 రోజుల పాటు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాత్ర
- యాత్రకు మద్దతు ప్రకటించిన మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు
- ఓట్ల తొలగింపును 'ఓట్‌బందీ'గా అభివర్ణించిన విపక్షాలు
- రాహుల్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎన్నికల సంఘం

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఓటర్ల జాబితా నుంచి పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని 'ఓట్‌బందీ'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన

వివరాలు 2లో..

# బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదు

## సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ

- బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని కేంద్రం స్పష్టీకరణ
- ఈ విషయంలో కోర్టులు జోక్యం చేసుకుంటే రాజ్యాంగ గందరగోళం తప్పదన్న కేంద్రం
- గడువు పెట్టడం వల్ల అత్యున్నత పదవుల గౌరవం తగ్గుతుందని ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:**శాసనసభలు ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్లు ఆమోదముద్ర వేయ డానికి కాలపరిమితి విధించే అధికారం న్యాయస్థానాలకు లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటే, అది రాజ్యాంగపరమైన

వివరాలు 2లో..



# భారత గగనతలానికి 'సుదర్శన చక్రం'... ఇక శత్రువుల ఆటలు సాగవు!

- ప్రధాని మోదీ ప్రకటించిన 'మిషన్ సుదర్శన్ చక్ర'
- దేశానికి బహుళస్థాయి గగనతల రక్షణ కవచం
- 2035 నాటికి దేశంలోని అన్ని కీలక ప్రాంతాలకు భద్రత
- రక్షణతో పాటు శత్రువుపై ప్రతిదాడి చేయగల సామర్థ్యం
- స్వదేశీ క్షిపణులతో వ్యవస్థను బలోపేతం చేయనున్న డీఆర్‌డీఓ
- ఇటీవల పాక్ విమానాలను కూల్చేసిన S-400 వ్యవస్థ

**పెన్ పవర్ డెస్క్:**భారత రక్షణ వ్యవస్థలో సరి కొత్త అధ్యాయానికి తెరలే చింది. దేశ గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చేం దుకు ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మ క 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రధానమంత్రి

వివరాలు 2లో..



# ట్రంప్ హయాంలో రష్యాతో వాణిజ్యం 20 శాతం పెరిగిందన్న పుతిన్

- అమెరికాతో వాణిజ్యం... రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- రష్యా చమురు కొనుగోలుపై భారత్‌కు ట్రంప్ ఊరట
- సుంకాల విధింపుపై వెనక్కి తగ్గే అవకాశం ఉందని సూచన



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా, రష్యా సంబంధాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అలస్కాలో జరిగిన శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పుతిన్

వివరాలు 2లో..

# ఉలిక్కిపడిన ధర్మవరం.. ఉగ్రసంస్థలతో లింకులపై నోరు విప్పని నూర్ మహమ్మద్



**పెన్ పవర్ డెస్క్:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌లో చాటింగ్ చేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం యువకుడు నూర్ మహ్మద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్ నుంచి కీలక సమాచారం అందడంతో అప్రమత్తమైన ధర్మవరం పోలీసులు గత కొద్ది రోజులుగా అతనిపై నిఘా పెట్టారు. నిన్న రాత్రి నూర్ మహమ్మద్ ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించారు. తెల్లవారుజామున డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో పోలీసుల బృందం నిందితుడి ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. అతను ధర్మవరం మార్కెట్ సమీపంలోని సల్మాన్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడి ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.నూర్.. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల ప్రభావానికి లోనైనట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# చినబాబు క్యాడర్ కు మంచి కిక్కు ఇస్తున్నట్లుందిగా?

తెలుగుదేశం పార్టీని మూడు రకాలుగా చూడాలి. ఒకటి ఎన్టీ రామారావు హయాంలో.. పార్టీ ఆవిర్భావం నుంచి 1995 వరకూ ఎన్టీఆర్ మాట వేదంగా ఉండేది. పార్టీ క్యాడర్ కు ఆయన మాటలు పూర్తి స్థాయిలో మత్తు నిచ్చేవి. ఆయన డైలాగులతో, హావభావాలతోనే ఆంధ్రప్రదేశ్ లో తొలిసారి పార్టీ పెట్టి ఎనిమిది నెలల్లో అధికారంలోకి తెచ్చిన చరిత్రను గడించారు. అయితే తర్వాత ఆయన శకం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 1995 నుంచి వచ్చారు. చంద్రబాబు నాయుడు ఆచితూచి వ్యవహరించేవారు. అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ మనసులో ఉన్నది గుర్తించలేకపోయేవారని, అధికారంలో లేనప్పుడు మాత్రం ఆయనకు కార్యకర్తలు గుర్తుకు వచ్చేవారని ఇప్పటికీ పార్టీలో నేతలు అంటుంటారు.

**చంద్రబాబు సాఫ్ట్ కార్నర్...**

1995 నుంచి 2024 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేతగా ఆయన నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చారు. చంద్రబాబు నాయుడు స్వయం శక్తితో ఎదిగిన నేత. తన వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలతో ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని ఇప్పటి వరకూ లాక్కుని వచ్చారంటే ఆయన శ్రమ ఫలితమే. నందమూరి వారసులకు పార్టీ చిక్కి ఉంటే ఏమయి పోయి ఉండేదో తెలియదు కానీ, చంద్రబాబు చేతిలో పార్టీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లిందని అనేవారు ఇప్పటికీ సీనియర్ నేతలున్నారు. ప్రతి ఎన్నికకు తన వ్యూహాన్ని మారుస్తూ.. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత చంద్రబాబు నాయుడు అని వేరే చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆయన సాఫ్ట్ కార్నర్ సీనియర్ నేతలకు నచ్చుతుందేమో కానీ యువనేతలకు, క్యాడర్ కు నచ్చదు.

**రెడ్ బుక్ నుంచి పులివెందుల వరకూ...**

ఇక పార్టీ అధినేతగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతం మాత్రం పార్టీలో, ప్రభుత్వంలో లోకేశ్ మాట చెల్లుబాటు అవుతుంది. యువగళం పాదయాత్రతో కార్యకర్తల మనోభావాలను తెలుసుకున్న చినబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు పరుస్తున్నారు. ముఖ్యంగా రెడ్ బుక్ నుంచి నిన్న మొన్నటి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక వరకూ లోకేశ్ ఆదేశాలే పార్టీకి హైప్ తెచ్చాయని చెప్పాలి. గత ప్రభుత్వంలో తాము అనుభవించిన ఆవేదనను చినబాబు తీర్చేస్తున్నారని క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు తమపై చెలరేగిన నేతలను అరెస్ట్ చేయించడంలో చినబాబు ఆదేశాల వల్లనే జరిగిందని బలంగా క్యాడర్ నమ్ముతుంది.

**తగిన రీతిలో బదులివ్వడం...**

అందుకు తగ్గట్లుగానే లోకేశ్ కూడా ఎక్కడకు వెళ్లినా క్యాడర్ తో మమేకమవుతున్నారు. గత ప్రభుత్వంలో తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు అన్యాయం చేసిన వారిని వదలడం లేదు. వారు అధికారులు కావచ్చు. ప్రజాప్రతినిధులు కావచ్చు. కత్తికి .. కత్తి.. కేసుకు.. కేసు అన్న రీతిలో ఆయన బదులివ్వడం పసుపు పార్టీ క్యాడర్ లో మంచి హుషారును ఇస్తుంది. అంతేకాదు ఫుల్లు కిక్కుకూడా ఇస్తుంది. అందుకే చినబాబు లోకేశ్ క్యాడర్ గురించి చేసే ఏ ఆలోచనలోనూ వెనుకంజ వేయడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బిజీగా గడుపుతున్నప్పటికీ పార్టీ బాగోగులను, క్యాడర్ సంక్షేమాన్ని మాత్రం లోకేశ్ పట్టించుకుంటున్నారని సోషల్ మీడియాలో కూడా పెద్దయెత్తున ఆయనను ప్రశంసిస్తూ పోస్టింగ్ లు కనిపిస్తున్నాయి. మొత్తం మీద నారా లోకేశ్ ప్రత్యర్థులను తొక్కి నార తీస్తున్నాడన్న సంతోషం మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఉంది.

# ఏపీలో మరో అల్పపీడనం...

- మొదటి పేజీ తరువాయి

ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే ఉన్న అల్పపీడనానికి ఇది తోడవడంతో, రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ అల్పపీడనాల ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదవుతుందని ఆయన అంచనా వేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే ప్రమాదం ఉన్నందున, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులపై మాట్లాడుతూ, ఉత్తర కోస్తాలోని అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు ఉంటాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# ఉలిక్కిపడిన ధర్మవరం.. ఉగ్రసంస్థలతో లింకులపై నోరు విప్పని నూర్ మహమ్మద్

- మొదటి పేజీ తరువాయి

పాక్‌లోని ఉగ్రసంస్థలతో నిత్యం వాట్సాప్ చాటింగ్ చేస్తూ.. సుమారు 30 ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా ఉన్నట్టు గుర్తించారు. నిందితుడి ఇంట్లో కొన్ని సిమ్ కార్డులు, ఉగ్రవాదాన్ని ప్రేరేపించే పుస్తకాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని విశ్లేషిస్తున్నారు. సిమ్ కార్డులు ఎక్కడ కొనుగోలు చేశాడు? ఎలా వినియోగిస్తున్నాడు? ఒక్కో సిమ్ కార్డుతో ఎన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో సభ్యుడిగా ఉన్నాడు? ఏయే విషయాలపై చాటింగ్ చేశాడన్న విషయాలను పరిశీలిస్తున్నారు. ఫోన్ కాల్స్‌కు సంబంధించిన సమాచారం కోసం ఆయా సిమ్ నెట్ వర్క్ సంస్థల నుంచి సేకరించేందుకు అధికారికంగా మెయిల్స్ పెడుతున్నారు. సింధూర్ ఘటన తరువాత పాకిస్థాన్‌లోని తీవ్రవాద సంస్థలతో నూర్ మహమ్మద్ ఎక్కువ సార్లు మాట్లాడినట్టు సమాచారం. నిందితుడు నూర్ మహమ్మద్‌ను పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించారు. నిందితుడి కుటుంబంలో తగాదాల కారణంగా భార్య.. నూర్ మహమ్మద్‌ను వదిలి వేరుగా ఉంటున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే తాడిపత్రిలో ఓ మహిళతో ఇతనికి వివాహేతర సంబంధం ఉన్నట్టుగా గుర్తించిన పోలీసులు.. ఆమె గురించి మధ్యాహ్నం వరకు విచారించారు. పాకిస్థాన్ తీవ్రవాద సంస్థలతో ఆ మహిళకు కూడా ఏమైనా సంబంధాలు ఉన్నాయా?అన్న కోణంలో ప్రశ్నించారు. మార్కెట్ సమీపంలోని సల్మా బిర్యానీ హోటల్ చుట్టపక్కల కూడా నిందితుడికి సంబంధించిన కొంత సమాచారాన్ని పోలీసులు సేకరించారు. నిందితుడు నూర్ పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, సాయంత్రం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కదిరిలో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నూర్ మహమ్మద్‌కు న్యాయమూర్తి ఈ నెల 29 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని ధర్మవరం పోలీసులు కడప జైలుకు తరలించారు. నూర్ మహమ్మద్‌ను విచారిస్తుండగానే ధర్మవరం ఎర్రగుంట కాలనీకి చెందిన రియాజ్ అనే ఆటో డ్రైవర్ భారతదేశానికి వ్యతిరేకంగా, పాక్‌కు అనుకూలంగా వాట్సాప్ డీపీ పెట్టుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. రియాజ్‌ను కుడా అదుపులోకి తీసుకొని డీఎస్పీ కార్యాలయంలో విచారిస్తున్నారు. అయితే, నూర్ మహమ్మద్‌కు, రియాజ్‌కు సంబంధాలున్నట్లు పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదనేది సమాచారం.

# కుక్కల ప్రేమికులు పేదలను దత్తత తీసుకుని వీధులను కుక్కలకు వదిలేయాలి

- మొదటి పేజీ తరువాయి

కుటుంబ సభ్యులతో సమానం అయితే, మీ ఇంట్లోని పెంపుడు కుక్కలనే ఎందుకు పెళ్లి చేసుకోకూడదు?" అంటూ వర్మ సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా, "పేదలందరినీ మీ ఇళ్లలోకి తెచ్చుకుని, వీధులను పూర్తిగా కుక్కలకే వదిలేయొచ్చు కదా?" అని ఆయన తనదైన శైలిలో ఎద్దేవా చేశారు. పాలకుల మౌనం కన్నా వీధికుక్కల అరుపులే మేలని, అందుకే పాలకుల స్థానంలో వాటినే కూర్చోబెట్టాలని వ్యాఖ్యానించారు. వర్మ తన వ్యంగ్యాన్ని మరింత తీవ్రతరం చేస్తూ, "మీ పిల్లలను వీధికుక్కల గుంపుతో ఆడుకోవడానికి పంపించి, ప్రకృతితో బంధం పెంచుకోమని చెప్పగలరా?" అని నిలదీశారు. కుక్కలకు కూడా పిల్లలతో సమాన హక్కులు ఉన్నాయని భావిస్తే, వీధికుక్కల కోసం పాఠశాలలు, పిల్లల కోసం కొట్టాలు (కెన్నెల్స్) నిర్మించాలని అన్నారు. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి బదులు వెటర్నరీ డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని శునక ప్రియులకు ఆయన సలహా ఇచ్చారు.

"కుక్కలను దేవుళ్ల కంటే ఎక్కువగా పూజిస్తున్నారు కాబట్టి, దేవాలయాల్లోని విగ్రహాలను తొలగించి, వాటి స్థానంలో వీధికుక్కలను పెట్టి మోక్షం కోసం ప్రార్థించండి," అని వర్మ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన అభిప్రాయాలను కొందరు సమర్థిస్తుండగా, జంతు ప్రేమికులు, శునక ప్రియులు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు.

# భారత గగనతలానికి 'సుదర్శన చక్రం'... ఇక శత్రువుల ఆటలు సాగవు!

- మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీ మొన్న (శుక్రవారం) ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మిషన్ కింద దేశవ్యాప్తంగా బహుళ-స్థాయి గగనతల, క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. 2035 నాటికి దేశంలోని ప్రతి పౌరుడికి, కీలకమైన మౌలిక సదుపాయాలకు సంపూర్ణ రక్షణ కల్పించడమే ఈ బృహత్తర కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న మూడు నెలల తర్వాత ఈ కీలక ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, "ప్రతి పౌరుడికీ రక్షణ లభించాలి. శత్రువు ఏ సాంకేతికతతో దాడి చేసినా, దాన్ని అధిగమించే టెక్నాలజీ మన దగ్గర ఉండాలి" అని స్పష్టం చేశారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు ఉపయోగించిన సుదర్శన చక్రంలా, ఈ వ్యవస్థ కూడా శత్రు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని ఆయన అన్నారు.

**అసలేంటి 'సుదర్శన చక్రం'?**

'మిషన్ సుదర్శన చక్రం' అనేది కేవలం ఒక ఆయుధం కాదు. ఇదొక సమీకృత, అత్యాధునిక రక్షణ కవచం. ఇందులో భాగంగా అంతరిక్ష ఆధారిత వ్యవస్థలు, శక్తిమంతమైన రాడార్లు, అత్యాధునిక సెన్సార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, భూమి, సముద్రం నుంచి ప్రయోగించగల ఇంటర్‌సెప్టర్ క్షిపణుల నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా నిర్మిస్తారు. రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, మతపరమైన కేంద్రాలు, ఇతర కీలక పౌర, సైనిక స్థావరాలను శత్రువుల క్షిపణులు, డ్రోన్లు, యుద్ధ విమానాల దాడుల నుంచి కాపాడటమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ వ్యవస్థ ద్వారా ముప్పును ముందుగానే పసిగట్టి, గగనతలంలోనే దానిని నిర్వీర్యం చేస్తారు.

**రక్షణతో పాటు ప్రతిదాడి సామర్థ్యం**

ఈ మిషన్ కేవలం రక్షణకే పరిమితం కాదు, శత్రువుపై బహుళ రెట్ల శక్తితో ప్రతిదాడి చేసే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. ఇందులో భాగంగా భారత అమ్ములపొదిలోకి కొత్త తరం క్షిపణులను చేర్చనున్నారు. 500 కిలోమీటర్ల పరిధి కలిగిన 'ప్రళయ్' క్వాసీ-బాలిస్టిక్ క్షిపణి, 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సబ్‌సోనిక్ లాంగ్-రేంజ్ క్రూయిజ్ క్షిపణి వంటివి ఈ వ్యవస్థలో భాగం కానున్నాయి. అంతేకాకుండా, ఇప్పటికే భారత త్రివిధ దళాలకు వెన్నెముకగా ఉన్న బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి పరిధిని 450 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు పెంచే ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

**ఇప్పటికే నిరూపితమైన పటిష్ట వ్యవస్థ**

భారత్ ఇప్పటికే తన గగనతల రక్షణ సామర్థ్యాన్ని పలుమార్లు నిరూపించుకుంది. ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఎ.పి. సింగ్ వెల్లడించిన దాని ప్రకారం, రష్యా నుంచి కొనుగోలు చేసిన %ూ%-400 గగనతల రక్షణ వ్యవస్థ... పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, ఒక భారీ నిఘా విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల దూరంలోనే గుర్తించి కూల్చివేసింది. అలాగే, మే 7-10 తేదీల్లో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ డ్రోన్లు, చైనా క్షిపణుల దాడులను భారత రక్షణ వ్యవస్థలు విజయవంతంగా తిప్పికొట్టాయి. ఈ అనుభవాల పునాదిపై 'సుదర్శన చక్రం'ను మరింత పటిష్ఠంగా నిర్మించనున్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు**

ఈ మిషన్‌లో భాగంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పలు కీలక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. 'ప్రాజెక్ట్ కుశ' పేరుతో స్వదేశీ లాంగ్-రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైల్ ( వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ఇది 150 కి.మీ., 250 కి.మీ., 350 కి.మీ. దూరంలోని శత్రు లక్ష్యాలను అడ్డుకో గలదు. దీని మొదటి దశ 2028-29 నాటికి అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

దీనితో పాటు, 2,000 కిలోమీటర్ల దూరంలోని బాలిస్టిక్ క్షిపణులను వాతావరణం లోపల, వెలుపల ధ్వంసం చేయగల రెండంచెల బాలిస్టిక్ క్షిపణి రక్షణ

వ్యవస్థ మొదటి దశకు త్వరలో ఆమోదం లభించనుంది. గత ఏడాది 5,000 కిలోమీటర్ల పరిధి గల అణు క్షిపణులను సైతం ఎదుర్కొగల రెండో దశ బీఎండీ పరీక్ష విజయవంతమైంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే, భారత గగనతలం అక్షరాలా అభేద్యంగా మారుతుంది.

# బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదు

- మొదటి పేజీ తరువాయి

గందరగోళానికి దారితీస్తుందని తన అభిప్రాయాన్ని వెల్లడించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వవచ్చా? అనే అంశంపై సుప్రీంకోర్టు జారీచేసిన నోటీసులకు కేంద్రం ఈ మేరకు బదులిచ్చింది. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గడువు విధించడం ద్వారా రాష్ట్రపతి, గవర్నర్ల వంటి అత్యున్నత పదవుల గౌరవాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రెండు పదవులు ప్రజాస్వామ్య పాలనలో ఉన్నత పదవులని పేర్కొంది. వారి అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవడం సరైన విధానం కాదని తెలిపింది.ద

ఒకవేళ వారి విధి నిర్వహణలో ఏవైనా లోపాలు తలెత్తితే, వాటిని న్యాయవ్యవస్థ జోక్యంతో కాకుండా రాజ్యాంగబద్ధమైన యంత్రాంగాల ద్వారానే సరిదిద్దాలని కేంద్రం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ రకమైన జోక్యం వల్ల కొన్ని అనవసర సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని తన అఫిడవిట్‌లో పేర్కొంది.

# ట్రంప్ హయాంలో రష్యాతో వాణిజ్యం 20 శాతం పెరిగిందన్న పుతిన్

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ, ట్రంప్ పరిపాలనలో అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 20 శాతం పెరిగిందని ఆయన తెలిపారు. "ఇది కేవలం సాంకేతికపరమైన సంఖ్యే అయినప్పటికీ, వాస్తవానికి వాణిజ్యం వృద్ధి చెందింది. సహకారానికి మాకు చాలా ఆసక్తికరమైన రంగాలు ఉన్నాయి" అని పుతిన్ అన్నారు. ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం వంటి రంగాల్లో కలిసి పనిచేసేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు.

**ట్రంప్ వైఖరిలో మార్పు**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై కఠినమైన సుంకాలు విధిస్తామని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆ తర్వాత తన వైఖరిలో మార్పు వచ్చినట్లు సంకేతాలిచ్చారు. భారత్‌పై 'సెకండరీ టారిఫ్'లు విధించాల్సిన అవసరం బహుశా రాకపోవచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. "భారత్ వంటి ఒక పెద్ద ఆయిల్ క్లయింట్‌ను రష్యా కోల్పోయింది. నేను సెకండరీ టారిఫ్ విధిస్తే, అది వారికి చాలా నష్టాన్ని కలిగిస్తుంది. అవసరమైతేనే ఆ పని చేస్తాను. బహుశా చేయాల్సిన అవసరం రాకపోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. పుతిన్ తో ట్రంప్ సమావేశం విజయవంతం కాకపోతే భారత్‌పై సుంకాలు మరింత పెరిగే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కొద్ది రోజుల క్రితం హెచ్చరించారు. అయితే, రష్యాతో ఆర్థిక సహకారం వల్ల తమకే ప్రయోజనం ఉంటుందని అమెరికా భావిస్తున్నట్లు రష్యా వార్తా సంస్థ 'టాస్' పేర్కొంది.

# సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్

- మొదటి పేజీ తరువాయి

బిడ్డలకు పథకంలో కోత పెట్టారు. రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలకు సరిపెట్టారు. మూడు సిలిండర్లు ఎంత మందికి అందుతున్నాయో అర్థంకాని పరిస్థితి! 14 నెలల తర్వాత ఫ్రీ బస్సు అమలు చేసి, సూపర్ సిక్స్ హామీలను ఉద్ధరించామని చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం.

చంద్రబాబు గారు రాష్ట్ర ప్రజలకు చేసింది ఘరానా మోసం. రాష్ట్రంలో సంక్షేమం సన్నగిల్లింది. అభివృద్ధి అటకెక్కింది. సుపరిపాలన కొండెక్కింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు ఘనం... అమలు మాత్రం అరచేతిలో వైకుంఠం" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

# 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

- మొదటి పేజీ తరువాయి

సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని తన పోస్టులో పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, అది వారి స్వేచ్ఛకు, గౌరవానికి, ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ ఉచిత బస్సు టికెట్ మహిళల సాధికారతకు ప్రతీక. ఇది కేవలం ప్రయాణం కాదు, సమాన అవకాశాల దిశగా వేస్తున్న ఒక ముందడుగు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా సాధికారతకు మా ప్రభుత్వం పట్టం కట్టింది" అని లోకేశ్ తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలని ఆయన రాష్ట్రంలోని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రయాణ సమయంలో తమ ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి, మహిళా సాధికారత అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాలని ఆయన కోరారు.

# బీహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టిన రాహుల్ గాంధీ

- మొదటి పేజీ తరువాయి

బాట పట్టారు. ఎన్నికల సంఘం (ఈసీ) తీరుకు నిరసనగా ఆయన శనివారం 'ఓట్ అధికార్ యాత్ర'ను ప్రారంభించారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 16 రోజుల పాటు సాగనుంది. ఆదివారం నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ యాత్ర 23 జిల్లాల మీదుగా కొనసాగనుంది. ససారామ్‌లో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ నిరసన కార్యక్రమానికి మహాగర్‌బంధన్ మిత్రపక్షాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్‌తో కలిసి తాము కూడా ప్రజలను సమీకరిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసీ, బీజేపీతో కుమ్మక్కై ఓట్లను తొలగిస్తోందని ఆగస్టు 7న రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ఆధారంగా కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ డేటాను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయాలని కోరగా, తాను రాజ్యాంగంపై ప్రమాణం చేసినందున ఆ అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు. "ప్రతి వ్యక్తికి ఒక ఓటు అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు. దానిని కాపాడేందుకే ఈ పోరాటం. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీహార్‌లో మాతో కలవండి" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. మరోవైపు, తేజస్వీ యాదవ్ ఈ యాత్ర కోసం ఒక ప్రచార గీతాన్ని విడుదల చేశారు. "ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి పోకూడదు. ప్రజల్లో చైతన్యం తేవడమే మా లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని కూడా విపక్షాలు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాయి.

# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు




## జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వ హణ స్పందన సంస్థ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం జిల్లా కలెక్టర్ జిల్లాస్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోనసీమ జిల్లాలోని డ్రైన్లు కాలువల పూడికలు తొలగించాలని సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వివరాలు తెలుసుకోవాలని వెనుకకు రప్పించాలని,రానున్న రెండు రోజులు మత్స్యకారులు ఎవరు సముద్రంపై వేటకు వెళ్ళరాదని సూచించారు. కోనసీమ జిల్లాలోని ప్రజలు అత్యవసర పరిస్థితులు ఉంటే మాత్రమే బయటకు రావాలని, ఎటువంటి ప్రయాణాలు చేయరాదనీ,ప్రజానీకానికి తెలియజేయాలన్నారు. కోనసీమ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నందు 08856 293104 ఫోను సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందనీ, అత్యవసర పరిస్థితులలో ఈ నెంబర్లో సంప్రదించి సహాయం కోరవచ్చునన్నారు డివిజన్లో స్థాయిలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాలోని అన్ని పాఠశాలలో భవన స్థితిగతులను పరిశీలించి శిధిలావస్థలో ఉన్న ఎడల అవసరమైతే మరియొక పాఠశాలకు,విద్యార్థినీ విద్యార్థులను తరలించాలని ఆదేశించారు. డివిజనల్ అధికారులు అందరూ తమ పరిధిలోని రెవిన్యూ పోలీస్ ఎలక్ట్రికల్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నిక

## ఎంపీ సనా సతీష్ బాబు

**కాకినాడ,ఆగస్టు 16 పెన్ పవర్:**రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు మరోసారి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ క్లబ్‌లో నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. వరుసగా రెండోసారి ఈ బాధ్యతలు చేపట్టిన ఆయన రాబోయే మూడు సంవత్సరాలు ఏసిఏకి నాయకత్వం వహించనున్నారు. క్రికెటర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన సానా సతీష్ బాబు,మొదటి టర్మ్‌లోనే విశేష కృషి చేసి క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకున్నారు. మహిళా క్రికెట్‌కి ప్రోత్సాహం,గ్రామీణ ప్రతిభావంతులను గుర్తించి ఎపిఎల్ వరకు తీసుకురావడం, విశాఖ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీర్చిదిద్దడం, అక్కడ అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించడం వంటి విజయాలు ఆయన నాయకత్వానికి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అతని కృషికి బీసీసీఐ కూడా ప్రశంసలు అందించింది. కార్యదర్శి జయ్ షా ప్రత్యేకంగా అభినందించడం సానా సతీష్ బాబు ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకువచ్చింది. ఇదే సమయంలో అమరావతి స్టేడియం నిర్మాణంపై ఆయన చేస్తున్న కృషి రాష్ట్ర క్రికెటర్లలో కొత్త ఆశలు నింపుతోంది. ఈ నేపథ్యంలో జరిగిన తాజా ఎసిఎ ఎన్నికల్లో ఆయన విజయం ఖాయమని ముందుగానే భావించినట్లుగానే, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన సానా సతీష్ బాబును, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, కాకినాడకు చెందిన క్రికెట్ అభిమానులు, తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

## స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త సర్దార్ గౌతు లచ్చన్న : జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నివాళి





**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 16 :**స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్తగా అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శనివారం కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం లచ్చన్న గారు విరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల ప్రజల్లో చైతన్యం నింపిన నాయకుడని తెలిపారు. వెనుకబడిన వర్గాల పిల్లలు చదువుకునేలా హాస్టళ్ళు, పాఠశాలలు ఏర్పాటు చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. భావితరాలకు గౌతు లచ్చన్న జీవితం ఆదర్శమని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.లిల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, సహాయ బీసీ సంక్షేమాధికారి పి.రామకృష్ణ, డబ్ల్యూహెచ్వోలు బహుదూర్, వై.కల్పన, కారపు సూర్య శివప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 16:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం జగ్గంపేటలో శ్రీకృష్ణుడి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీరామ్ నగర్ లో శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీధుల్లో ఉన్న చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వినాయక యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాయంత్రం వీధిలో ఉన్న చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలా మణికంఠ, జగదీష్, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

## గొల్లపాలెంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





**ఉట్టుకొట్టిన మంత్రి సుభాష్**

**కాజులూరు, పెన్ పవర్, ఆగస్టు 16:**మండలంలోని గొల్లపాలెం గ్రామం శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా గొల్లపాలెం మార్కెట్ సెంటర్‌లోని విష్ణాలయాన్ని దర్శించిన మంత్రి అనంతరం పెద్దవీధి గొల్లల కృష్ణాలయానికి నడుచుకుంటూ వెళ్లారు. దారిపొడవునా చిన్నారులు పూల వర్షం కురిపించగా, పెద్దలు 'తీన్మార్' డప్పు మ్రోగిస్తూ ఘనస్వాగతం పలికారు. ఆలయంలో కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులతో పాటు చిన్నారులతో మంత్రి సుభాష్ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన మంత్రి స్థానిక సమస్యలపై స్పందించారు. ఆదిమూలపు కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కింగ్ కోసం వినియోగించాలన్న డిమాండ్‌పై వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శిని పంపించి ఎస్టిమేట్ వేయించాల్సిన అవసరముందని తెలిపారు. అలాగే స్థానిక డ్రైనేజీ పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న టాక్సీ స్టాండ్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామస్థులు కోరగా, ఆ స్థలం పోరంబోకు కావడంతో అక్కడ శాశ్వత కట్టడాలు నిర్మించడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై రేకు షెడ్ నిర్మాణం సాధ్యాసాధ్యా లను పరిశీలిస్తానని చెప్పారు. అయితే ఇదే అంశంపై కూటమి నాయకుల్లో భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవడం విశేషంగా మారింది. ఈ కార్యక్రమంలో అంగర కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, పండు స్వామి, తోట కృష్ణ, జనసేన నాయకులు దేగల సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్కా శ్రీను, వనమాడి శ్రీను, వల్లు అర్జునరావు, కోకా హరి, మృత్యం జయ చౌదరి (పెదబాబు), శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ, నాగార్జున, యేరుబండి నాని (వాటర్ ప్లాంట్), చిన్నా, ఎస్సై మోహన్ కుమార్, గుత్తుల బుల్లిరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు,పలివెల రాజు, పెంకే అప్పారావు, వడ్లపాటి వెంకటరమణ,కృష్ణాలయం పెద్దలు, సంఘ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత కార్మికుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా: మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్ ఆగస్టు 16 :**చేనేత కార్మికుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అద్దంపల్లి గ్రామంలో చేనేత సంఘాల నేతలతో సమీక్ష నిర్వహించిన ఆయన మాట్లా డుతూ,నేతన్నలకు విద్యుత్ రాయితీలు, రూ. 25 వేల ఆర్థిక సహాయం, రూ. 4 వేల పింఛన్లతో పాటు నూలు సబ్సిడీ, ఆప్కో ద్వారా విక్రయాల పునరుద్ధరణ, చేనేత శాలల నిర్మాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆయన తెలిపారు.



# ఉత్తర కోస్తాలో ఉదయించిన సూర్యుడు గౌతు లచ్చన్న

- కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావు




**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16:** ఉత్తరకోస్తా నందు ఉదయించిన ప్రజా సూర్యుడు, స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని కలెక్టరేట్ పరిపాలన అధికారి కడలి కాశీ విశ్వేశ్వ రరావు అన్నారు.శనివారం స్థానిక కలెక్టరేట్ నందు సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జన్మదిన వేడుకలను అధి కారికంగా జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా పరిపాలనాధికారి మాట్లాడుతూ తెలుగు స్వాతంత్ర్య సమర యోధులు, బడుగు బలహీన వర్గాల పెన్నిధి, రైతు బాంధవుడు, కార్మిక శ్రేయోభిలాషి అయినా, స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమర యోధులు గౌతు లచ్చన్న గ జయంతి వేడుకలు ప్రభుత్వ లాంఛనాలతో నేడు జరుగుచున్న సందర్భ%శీ%గా శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఈ మహోన్నత అవకాశాన్ని ఇచ్చిన ప్రభుత్వానికి కృత్ఞతలు తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న వారి జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఆయన శ్రీకాకుళం ప్రజలకు తరతరాలుగా స్ఫూర్తిగా నిలిచారన్నారు.ప్రజాసేవ పట్ల ఉన్న వారికి ఉన్న నిబద్ధత ప్రతి ఒక్కరికి సర్వదా మార్గదర్శకంగా నిలుస్తోంద న్నారు.ఆయన ధైర్యం సేవ యొక్క వార సత్వం ఇప్పటికీ మనకు మార్గనిర్దేశం చేస్తుం దన్నా రు.స్వాతంత్ర్య సమరయోధుడుగా పోరాటాలకు మారు పేరుగా గౌతు లచ్చన్న, బ్రిటిష్ రాజ్ పై తిరగబడ్డ సర్దార్ లచ్చన్న గా ప్రజల గుండెల్లో నిలిచార న్నారు.సర్దార్ వల్ల భాయ్ పటేల్ తర్వాత సర్దార్' అనే బిరుదు పొందిన రెండవ వ్యక్తిగా ప్రసిద్ధి చెందారన్నారు. ఈ బిరుదును ఆయన సాహసం, కార్యదక్షతకు మెచ్చి ప్రజలు ఇచ్చారన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా గాంధీజీ పిలుపుతో తన 21 వఏటనే స్వాతంత్ర్య ఉద్యమం లో చేరారన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం,క్విట్ ఇండియా ఉద్య మాల్లో చురుగ్గా పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనపై కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేయడంతో అజ్ఞాతవాసంలో ఉండి కూడా కార్యకలాపాలు,సాగించారన్నారు. హైకో ర్టులో కొట్టు వేయబడిన ఓ బి సి కోట పునరుద్ధరణకు,పాటుపడ్డారన్నారు.బీసీ వెల్ఫేర్ అధికారి పి రమేష్ ప్రసంగిస్తూ 35 సంవత్సరాలపాటు చట్ట సభలకు,ఎన్నికయ్యారన్నారు.టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా సేవలందించారన్నారు. జమీందారీ,ఇనాందారీ వ్యవస్థలకు వ్యతిరే కంగా అనేక రైతు ఉద్య మాలను నడిపారన్నారు.వెనుకబడిన తరగ తులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేశారని దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించడం, వారి విద్యాభివృద్ధికి పాటు పడటం వంటి సామాజిక సంస్కరణలను తీసుకుని రావడంతో పాటుగా, గౌతు లచ్చన్న కేవలం ఒక వ్యక్తి కాదనీ, ఒక ఉద్యమం, ఒక విప్లవానికి ప్రతీకగా పరిగణించబడ్డారన్నారు,నిజాయితీ, నిబద్ధత ఆయన సొంతమన్నారు.సామాజిక సమస్యలపై ఆయన పోరాడిన విధానం, ప్రజా సమస్యలను చట్ట సభల్లో గట్టిగా వినిపించిన తీరు గురించి,ఆయన జీవిత%శీ% యువతరానికి ఆదర్శంగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారులు కల్పవల్లి అనురాధ, గౌరీ కాత్యాయని సిహెచ్ సాయిరాం,సిహెచ్ రాధాకృష్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం బస్సు ప్రారంభం



ఎమ్మెల్యే సత్యప్రభ



**శంఖవరం, ఆగస్టు 16 పెన్ పవర్:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సత్యదేవుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ లభించాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే వాటిలో పాల్గొన్నారు.అదే కార్యక్రమంలో అరవిందో ఫార్మసీ వారు దేవస్థానానికి అందజేసిన బస్సును ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు.

# దేశాభివృద్ధికి కృషి చేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16:** దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి పురస్కరించుకుని అమలాపురం భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యాలయం నందు అమలాపురం పట్టణ అధ్యక్షులు అయ్యల భాస్కర రావు(భాషా) అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ పాల్గొని వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ వాజ్ పేయి సంఘ్ పరివార్ సభ్యుల నుంచి ప్రధానమంత్రి వరకు, ప్రధాన మంత్రిగా ఆయన చేసిన ముఖ్యమైన సంఘటనల్లో స్వర్ణ చతుర్భుజి వంటి ముఖ్యమైన కార్యక్రమాలను గురించి వివరించారు.వాజ్పేయి పరిమితి చెందిన రాజకీయ నైపుణ్యంతో విప్లవాత్మక నిర్ణయాలతో దేశాన్ని అభివృద్ధి వైపుగా నడిపించిన నాయకుడు అని తెలిపారు. దేశాభివృద్ధికి ఆయన గణనీయంగా కృషి చేశారన్నారు. బలమైన, సంపన్నమైన భారతదేశాన్ని నిర్మించడానికి వాజ్పేయి జీవితాంతం కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆనాడు వాజపేయి చేసిన సహకారం తెలుగు జాతి ఎప్పటికీ మర్చిపోదన్నారు. తాను నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి ఉన్న వ్యక్తి అని, ఆయనకు మార్చి 2015 లో భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించిందన్నారు. వాజ్ పేయి గొప్ప రాజనీతజ్ఞుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సుబ్బరాజు, ఇళ్ళ సత్యనారాయణ, సీనియర్ నాయకులు సంసాని రత్నకుమార్, దేవదాసు నాగార్జున, ప్రసాద్, పావులూరి వెంకట్, భూపతి రాజు సత్యనారాయణ వర్మ ,పేరా బత్తుల సుబ్బారావు, ఇరుకువ జిల వెంకట్రావు, బండి శ్రీనివాస్, కొండేటి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సక్రమంగా పనిచేయాలి-సంధ్య

**గోపాలపురం, పెన్ పవర్, ఆగస్టు 16.** ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే వైద్యులు రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా ఉప ఆరోగ్యశాఖ అధికారిని జే సంధ్య అన్నారు. మండలంలోని హుకుంపేట గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని వైద్యురాలు సంధ్య శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్యులకు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ ప్రమాద బారిన పడి వచ్చిన వారికి వెంటనే స్పందించి వైద్యం అందించాలన్నారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. రోగుల పట్ల ప్రేమ జాలి వంటివి చూపించాలని అన్నారు. ఇబ్బందికరమైన పరిస్థితుల మినహా మిగిలిన కేసులను స్థానికంగానే వైద్యం అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కట్టిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట



వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# దళిత వాడలో సామూహిక వరలక్ష్మి వ్రతం





**గోపాలపురం/నల్లజర్ల పెన్ పవర్, ఆగస్టు 16.** దానధర్మ చారిటబుల్ ట్రస్ట్, వేద సంకల్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం శనివారం ఘనంగా నిర్వహించారు. హరిజన పేటలోని శ్రీ రామాలయం ప్రాంగణంలో జరిగిన ఈ వ్రతంలో సుమారు 30 మంది మహిళలు పాల్గొని సాంప్రదాయ పద్ధతుల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. బ్రహ్మశ్రీ అరిపిరాల రుద్రమూర్తి మంత్రోచ్ఛారణల మధ్య ఈ వ్రతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, అమ్మవారికి కుంకుమ పూజ, నోములు, నైవేద్యాలు సమర్పణ అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్రతల్లో పాల్గొన్న మహిళలకు చీర, జాకెట్ పూజ సామాగ్రిని ట్రస్ట్ తరుపున అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావం పెంపొందించడమే తమ ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఉండడంవల్ల శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. భగవన్నామ స్మరణం పాపాల నుండి విముక్తి చేస్తుందన్నారు. దళిత వాడల్లో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి వారిని ఆధ్యాత్మికంగా బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరపు వెంకటరత్నం, పాతూరి వరప్రసాద్, పాతకోకల వెంకట్, అంబటి శ్రీనివాసరావు, నందమూరి రామకృష్ణ, నరేడ్ల సోమరాజు, సతీష్, తాతారావు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ వేణుగోపాల కృష్ణ ని దర్శించిన దేవాదుల



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా అమలాపురం పట్టణం గొల్లగూడెం బైపాస్ రోడ్డు వద్ద గల శ్రీవేణు గోపాల కృష్ణ ఆలయం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు,
ఈ కార్యక్రమం లో గున్నేపల్లి భీమశంకరం, పోలనాటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ దేవాలయం దర్శించిన బిజెపి జనసేన నాయకులు







**అమలాపురం రూరల్ పెన్ పవర్ ఆగస్టు 16:** మండలం లోని జనుపల్లి గ్రామంలో ఉన్న ఇస్కాన్ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా బీజేపీ జాతీయ నేత నల్లా పవన్ ఆలయాన్ని సందర్శించి శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా జనసేన మండల కన్వీనర్ లింగోలు పండు శ్రీకృష్ణుని దర్శించుకుని ఇస్కాన్ ప్రతినిధి సత్య జగన్నాథ్ దాస్ తో ప్రత్యేక పూజలు జరిపించారు.

# నిర్వాసిత కాలనీలను సందర్శించిన సిపిఎం బృందం..





- పోలవరం పునరావాస కాలనీల్లో కనీస సదుపాయాలు లేవు..
- సిపిఎం ఆల్ ఇండియా సెక్రటరీ ఎం.ఎ.బేబీ
- స్లాబుల నుంచి వర్షపు నీళ్లు కారిపోవడం, మరుగుదొడ్లలో లోపాలు- నిర్వాసితుల ఆవేదన
- తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు..
- ఉపాధి కోసం రోజూ 30-40 కి.మీ నడకన వెళ్లాల్సిన పరిస్థితి...

**దేవీపట్నం,పెన్ పవర్,ఆగస్టు16:** పోలవరం ముంపు ప్రజల కోసం నిర్మించిన పునరావాస కాలనీలలో వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని,తక్షణమే చర్యలు చేపట్టాలని,రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని సిపిఎం ఆల్ ఇండియా సెక్రెటరీ ఎం.ఎ.బేబీ హెచ్చరించారు.శనివారం దేవీపట్నం మండలం తాళ్లూరు,నాగులపల్లి పునరావాస కాలనీలో ఎం.ఎ.బేబీ పర్యటించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ%లొ% వేల కుటుంబాలు పోలవరం ప్రాజెక్టు కారణంగా మునిగిపోతున్నాయన్నారు.నిర్వాసితుల్లో 85 శాతం మంది ఆదివాసీలు ఉన్నారని తెలిపారు.పోలవరం నిర్వాసితులందరికీ గౌరవప్రదమైన పునరావాసం కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వంపై ఉందని,కానీ సుదీర్ఘకాలంగా పూర్తి నిర్లక్ష్యం జరిగినట్లు స్పష్టమవుతుందని అన్నారు.నిర్మాణాల్లో నాణ్యత లోపం కారణంగా వర్షాలకు స్లాబులు నుంచి నీళ్లు కారిపోతున్నాయని,మరుగుదొడ్లు కూడా సక్రమంగా నిర్మించలేదని,తాగునీటి సౌకర్యము పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.ఉపాధి కోసం ప్రతిరోజు 30 నుంచి 40 కిలోమీటర్లు నడకన వెళ్లాల్సిన దుస్థితి ఇక్కడి ప్రజలకు నెలకొంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు అని అన్నారు.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ,పునరావాస గృహాలకు అర్హులైనవారు సైతం దూరమయ్యారని వివరించారు.వీటన్నిటినీ సిపిఎం రాష్ట్ర కమిటీ ఇప్పటికే ఆందోళన రూపంలో ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని,ఇప్పటికైనా తక్షణమే బాధ్యతాయుతంగా ప్రభుత్వం స్పందించాలని బేబీ డిమాండ్ చేశారు.అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ...పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టంను అమలు చేయడంలో రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి అని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55 వేల కోట్లు కాగా,ప్రజల పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేయాల్సింది ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులతో కూడిన పునరావాసం కల్పించాల్సిన బాధ్యతను గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పరిశీలిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు.ప్రజల సమస్యలు విన్నవించుకునేందుకు నోడల్ అధికారి సైతం అందుబాటులో లేరని చెప్పారు.ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసితులు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారని అసహనాన్ని వ్యక్తం చేశారు.పాలక ప్రభుత్వాలు తక్షణమే స్పందించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర,అల్లూరి సీతారామరాజు జిల్లా సిపిఎం కార్యదర్శి బి.కిరణ్,తూర్పుగోదావరి జిల్లా సిపిఎం కార్యదర్శి టి.అరుణ్,సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు లోతా.రామారావు,తదితరులు పాల్గొన్నారు.

# మోతుగూడెం ఏపీ జెన్కో ఉద్యోగి ఆత్మహత్య

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 16:**మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఏపీ జెన్కో హాస్పిటల్‌లో పనిచేస్తున్న గోసాలి అప్పారావు (ఉద్యోగి) తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం మేరకు, అప్పారావు కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గతంలో బైపాస్ శస్త్రచికిత్స చేయించుకోవడంతో పాటు ఇతర సమస్యలతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో మానసిక కలత చెంది రాత్రి 10 గంటల సమయంలో ఇంటిలో ఐరన్ రాడ్‌కు ఉరివేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# చింతూరులో ఘనంగా మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజపేయి 7వ వర్ధంతి

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 16 :**చింతూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజపేయి 7వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజపేయి చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, బీజేపీ మండల అధ్యక్షులు బట్ట లక్ష్మయ్య రాజు, సీనియర్ నాయకులు నామాల శ్రీనివాసరావు, మండల నాయకులు తమ్మినేడి రామారావు, యువమోర్చ నాయకులు జంపన్న రాజు, శివాజీ, లచ్చు, టైలర్ రవి హాజరయ్యారు. అలాగే తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు ఇల్లా చిన్నరెడ్డి, ఎం.డి. జహంగీర్, నర్సింహారావు, సాల్మన్ రాజు, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, సీనియర్ నాయకులు



పయ్యాల నాగేశ్వరరావు, మండల నాయకులు మల్లిపూడి సతీష్, పయ్యాల ప్రవీణ్ (కప్పు), బక్క గణేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ అటల్ బిహారి వాజపేయి భారతదేశానికి ప్రగతి దిశగా మార్గదర్శకుడని, ఆయన స్ఫూర్తితో ప్రజా సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరం-శేషారావు

**గోపాలపురం/నల్లజర్ల, పెన్ పవర్, ఆగస్టు 16:**ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు కూరపాటి శేషారావు అన్నారు.తాను బాల్యంలో చదువుకున్న నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను శుక్రవారం అందజేశారు.79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి కూరపాటి కాంత కుమారి శేషారావు దంపతులు హాజరయ్యారు.పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి 2,000 రూపాయల నగదు, జ్ఞాపికను ఈ దంపతులు అందజేశారు.అలాగే ద్వితీయ,తృతీయ స్థానాలు దక్కించుకున్న వారికి 1500 రూపాయల నగదు జ్ఞాపకం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శేషారావు



మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన ఎందరో మహోన్నతమైన వ్యక్తులు నేడు ఎంతో ఉన్నతమైన స్థితిలో ఉన్నారన్నారు.నేటి యువత అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని చదువుల్లో రాణించి అభివృద్ధి చెందాలని కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి నేత మెట్ల రమణబాబు ని మర్యాదపూర్వకలసిన పలు చైర్మన్లు





**అమలాపురం పెన్ పవర్ ఆగస్ట్ 16:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ను వారి స్వగృహం లో, అమలాపురం పట్టణం, శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా నియమితులైన దున్నాల వెంకట నాగేంద్రరావు(బాబి) మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువా కప్పి, బోకే అందజేసినారు. అదేవిధంగా స్వర్ణకార విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళాబత్తుల చినబాబు మర్యాదపూర్వక కలిసి దుస్సాలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ జయంతి సురేష్, అడబాల దుర్గారావు, మానే సత్య ప్రకాష్, మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, శ్రీ సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి పుల్లయ్య నాయుడు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నల్లా మల్లిబాబు, టీడీపీ నాయకులు అనుపోజు శ్రీనివాస్, ముత్యాల బాబు, సాధనాల సురేష్, జనసేన నాయకులు నల్లా సత్యనారాయణ(బుజ్జి) మరియు శ్రీను గంధం తదితరులు పాల్గొన్నారులి...

# కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారులు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 16:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వర పుత్ర శక్తి గణపతి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని అందరిని ఆకట్టుకున్నారు. ముందుగా చిన్నారులు గ్రామమంతా కృష్ణ సంకీర్తన చేస్తూ ఉట్టిని ఊరేగించారు. భక్తులు సమర్పించిన డబ్బులను పేద యాదవునికి అందజేసి అనంతరం ఉట్టిని కొట్టారు. చిన్నారుల ఆటపాటలతో గ్రామం అంతా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. తరువాత వేషధారణలో విశేష ప్రతిభ కనబరచిన చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. చింతా లావణ్య కుమార్ సౌజన్యంతో చిన్నారులకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సంబరాలు, చిన్నారుల విన్యాసాలతో కృష్ణ లీలామృతమయం అయింది.





# 19న ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో ఉద్యమ్ ఆధార్ మెగా శిబిరం

- పరిశ్రమల శాఖ, డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఉద్యమ్ ఆధార్ నమోదు
- మధ్య, చిన్న తరహా పరిశ్రమల యజమానులు నమోదు చేసుకోవాలని కోరిన ఏపిఎం శ్రీనివాస్

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 16:**చిరు వ్యాపారాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన ప్రత్తిపాడు వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ్ ఆధార్ మెగా శిబిరం నిర్వహించబడనుంది. ఈ శిబిరాన్ని పరిశ్రమల శాఖ మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.విఈ సందర్భంగా ఏపీఎం జీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధి దారులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యమ్ ఆధార్ సర్టిఫికెట్ కలిగి ఉంటే ప్రభుత్వం అందించే ఉపాధి పథకాలు పొందడమే కాకుండా, వ్యాపారాల విస్తరణ కోసం బ్యాంకుల నుండి రుణాలను సులభంగా పొందే వీలుందని ఆయన తెలిపారు. అందువల్ల ప్రతి మహిళా వ్యాపారి, పురుష వ్యాపారి తప్పనిసరిగా ఈ శిబిరానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. అధికారుల వివరాల ప్రకారం, రిజిస్ట్రేషన్ కోసం హాజరయ్యే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ (ఓటీపీ



కోసం), బ్యాంకు పాస్‌బుక్, ఇమెయిల్ ఐడి వంటి ఐదు ముఖ్య పత్రాలు తీసుకురావాలని, ఈ పత్రాలు సమర్పించిన వారు అదే రోజు కౌంటర్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని, వెంటనే ఉద్యమ్ ఆధార్ సర్టిఫికెట్ పొందొచ్చని తెలిపారు.

# మానవతా సభ్యులు వాసిరెడ్డి శ్రీనివాస్ ఔదార్యం



**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 16 :**మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వాసిరెడ్డి శ్రీనివాసరావు ఔదార్యంతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.తన తండ్రి వాసిరెడ్డి రాధాకృష్ణన్ జ్ఞాపకార్థం వాదాలకుంటలోని ఎలిమెంటరీ పాఠశాలలోని పిల్లలు ఆడుకోవడానికి వీలుగా 20వేల రూపాయల తోటి జారుడుబల్ల ఏర్పాటు చేశారు.మరో ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు డైరీలు అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు మాట్లాడుతూ శ్రీనివాసరావు తన తండ్రి జ్ఞాపకార్థం సంస్థ అధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు.సభ్యులందరూ ప్రతి సమస్యపై స్పందించి తమ వంతు సహాయ సహకారాలు అందించడం పట్ల ఆనందదాయకం అన్నారు.ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు సంస్థ అధ్వర్యంలో చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు,గ్రామ సర్పంచ్ జొన్నకూటి మనమ్మ,ఉప సర్పంచ్ వల్లభనేని సత్యనారాయణ,సంస్థ కోశాధికారి గెడా జోగేంద్ర ప్రసాద్,కో చైర్మన్ నెల్లి చంద్రశేఖర్,సతీష్ మాస్టర్,కీర్తి కుమార్,కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దాకోడు గ్రామాన్ని సందర్శించిన అడ్డతీగల సిఐ బి.నరసింహమూర్తి...




**అడ్డతీగల ,పెన్ పవర్ ,ఆగస్టు 16:** అడ్డతీగల మండలం దాకోడు గ్రామాన్ని అడ్డతీగల సిఐ బి. నరసింహమూర్తి ,దుచ్చర్తి ఎస్సై పార్థసారథి సందర్శించారు. అక్కడి ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కారణంగా దాకోడు డి.రామవరం మధ్యలో ప్రమాదకరంగా ఉన్న కాలువను పరిశీలించారు. అనంతరం ప్రజల యొక్క ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి, సారా నిర్మూలన ,ప్రమాదకరమైన యాప్ లు డౌన్లోడ్ ,బాల్య వివాహాల గురించి, రోడ్డు ప్రమాదాలు గురించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోదుచ్చర్తి పోలీస్ సిబ్బంది, దాకోడు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న కుప్పం ఇంచార్జ్





**అమలాపురం పెన్ పవర్, ఆగష్టు 16:**అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆర్ టి సి సంస్థ వైస్ చైర్మన్ కుప్పం ఇంచార్జ్ మునిరత్నం, ఏ(ప్రెవిడిక్ చైర్మన్ రాజశేఖర్ లు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలకి, స్వామి వారి దర్శనం, వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్బంగా మునిరత్నం మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన అంతర్వేది శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషం గా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముప్పర్తి నాని,చాగంటి స్వామి, పోతురాజు కృష్ణ, అడబాల విజయ్, పోతాబత్తుల శ్రీనివాస్, శంకరగుప్తం నాని, ఎస్ కొండబాబు,నల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16:**, రావులచెరువు, 30వ వార్డు, శ్రీరామలయం, కృష్ణ మందిర వద్ద శ్రీరామ సేవా సమితి వారిచే, సమితి అధ్యక్షుడు గొవ్వాల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించి, చిన్నారులకు రాధ, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టి ఉత్సవం నిర్వహించారు. బహుమతి ప్రధానోత్సవ సభకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ అధ్యక్షత వహించి, శ్రీకృష్ణ తత్వాన్ని వివరించి, విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిధులుగా సలాది సాయిరాం, ఇస్కాన్ రాజమండ్రి అవుట్ పోస్ట్ మేనేజర్ శివనంద నిమాయిదాస్, గొవ్వాల నాగరాజు, కుడిపూడి సూర్యనారాయణ, వాసంశెట్టి రాంబాబు, చిదానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురం శ్రీ మదన్ గోపాల్ భజన్ కుటీర్ నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అమలాపురం రూరల్, పెన్ పవర్ ఆగస్ట్16 :** అమలాపురం రూరల్ జను పేల గ్రామం లో 10 వ తేదీన నూతనం గా ప్రారంభించిన శ్రీ నితాయి, గౌరంగ సంకీర్తన భవనం లో శ్రీకృష్ణ లీలలపై శివానంద నిమయి దాస్ (మేనేజర్) ప్రవచనం చేశారు. అలాగే ఉట్టి ఉత్సవం, నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఇస్కాన్ భక్తులు సద్భుజ దాస్, యశోమతి నందన దాస్, మురళి, %ఙణ్ణా% మెట్లరవణ బాబు, నల్ల పవన్ , పిండి రాజా , లింగోలు పండు , కల్వ కొలను తాతాజీ , జనుపల్లి గ్రామ సర్పంచ్ గణాల భారతి,వెంకటేశ్వ ర నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

# పడవ మరమ్మతులకు గుడ్ సీడ్ రూ.30 వేలు సహాయం.

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16:.**పి.గన్నవరం మండలం ఊడిమూడి లంకకు చెందిన గ్రామస్తులు ఊడిమూడి లంక నుంచి గోదావరి నదీ పాయ పై పడవపై ప్రయాణిస్తూ అవతలి వైపు ఉన్న పి.గన్నవరం వెళ్లేందుకు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇటీవల ఆ పడవ మరమ్మతులకు గురై ప్రయాణించేందుకు అనువుగా లేకపోవడంతో గోదావరి నదీ పాయ దాట లేక గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు దృష్టికి పలువురు తీసుకువచ్చారు. ఊడిమూడి లంక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న రమణారావు పడవ మరమ్మతులకు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు శనివారం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద పడవ మరమ్మత్తుల కొరకు గ్రామస్తులకు రూ. 30 వేలు చెక్కును రమణారావు అందజేశారు. పడవ మరమ్మత్తులకు ఆర్థిక సాయం అందజేసి గ్రామస్తుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న రమణారావుకు ఈ సందర్భంగా ఊడిమూడి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్,వైసిపి జిల్లా కార్యదర్శి గొలకోటి సూర్య ప్రకాష్, ఊడిమూడి గ్రామ పెద్దలు బండి శ్రీను, అయినపర్తి సత్యనారాయణ, బండి అశోక్, అయినపర్తి సత్యమూర్తి,గూటం మహేష్,యల్లమిల్లి సుధాకర్,వైసిపి నాయకులు పడమట రాజశేఖర్, నేలపూడి సుగంధ కుమార్,పందిరి సుబ్బరాజు,గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## టిడిపి మండలాధ్యక్షుడు జీను మణి బాబుకి సత్కారం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 16:** స్థానిక జేవియర్ అపార్ట్మెంట్ వద్ద జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన జీను మణి బాబును సీతారాంపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, జగ్గంపేట మండలం ఎంఆర్పిఎస్ నాయకులు ఆకుమర్తి గణేష్ ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జీను మణిబాబు మాట్లాడుతూ మనందరి అభిమాన నాయకుడు జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో ఈ ప్రాంత అభివృద్ధికి మనందరం సహాయ సహకారాలు అందిస్తూ నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ నాయకత్వంలో మన గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. ఎవరికైనా సంక్షేమ కార్యక్రమాలు అందకపోయినట్టయితే వారికి అందే విధంగా ప్రభుత్వం అధికారుల ద్వారా ప్రజలకు పనిచేసే పెడదామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం టిడిపి నాయకులు, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 16:** ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) కాకినాడ జిల్లా రెండో మహాసభలు జగ్గంపేటలో సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న రెండు రోజులపాటు జరగనున్నాయని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్ కుమార్ తెలియజేశారు. శనివారం దీనికి సంబంధించి గోడపత్రికను జగ్గంపేట రావులమ్మ గుడి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ 1214 మెమో సర్కులర్ 2020 జారీచేసి కార్మికుల పొట్టకొట్టిందని విమర్శించారు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని సంవత్సరం గడుస్తున్నా అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాబోయే మూడేళ్లలో సంక్షేమ పథకాలు అమలుకు మరియు కార్మికుల శ్రేయస్సుకు సంఘం కార్యక్రమాల రూపకల్పనకు ఈ మహాసభలు ఉపయోగపడతాయన్నారు. జగ్గంపేట ప్రజానీకం, ప్రజాప్రతినిధులు, మేధావులు, కార్మికుల శ్రేయస్సు కోరే వారందరూ ఈ మహాసభలకు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రొంగల ఈశ్వరరావు, కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కెంగం దుర్గాప్రసాద్, నండ్ల చిరంజీవి, పెన్నాడా వీరబాబు, కంది బాబు, కంది సతీష్, గంగుమళ్ల శ్రీను, కెంగం రాజు, కెంగం బుజ్జి, కర్రీ బాబూరావు, కడితి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా



**ఆత్రేయపురం పెన్ పవర్ అగస్ట్ 16:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శనివారం గౌడ రామాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతు లచన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు

ఈ కార్యక్రమంలో అయినవిల్లి సత్తిబాబు గౌడ్, గుడెల్ల నాగేంద్ర గౌడ్, అత్తిలి వెంకటేశ్వరరావు, చిటికెన రవి, పడమటి గణేష్, అత్తిలి వెంకట్, మట్ట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవా భావం, సమాజానికి చేసిన త్యాగం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా వక్తలు స్మరించారు. యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## గుణ్ణం సురేష్ జన్మదిన సందర్భంగా

# పలు సేవా కార్యక్రమాలు





**ఉంగుటూరు, పెన్ పవర్ ఆగస్టు 16:**నారాయణపురం మాజీ సర్పంచ్ గున్నం రామచంద్రరావు కుమారుడు గుణ్ణం సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జీ ఆర్ సీ ఆర్ చారిటీబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, గుణ్ణం సురేష్ బాబు యూత్ ఆధ్వర్యంలో చేపట్టారు.

ముందుగా నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద రామచంద్రరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ ఆఫీస్ లో శానిటరీ కార్మికులు, కార్యాలయ సిబ్బందికి వస్త్రాలు, ఆహారపదార్థాలు పంపిణీ చేశారు. ఆశా వర్కర్లకు చీరలు అందజేశారు.

చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు బ్రెడ్, ఫ్రూట్స్ పంపిణీ చేయగా, 50మంది ఎయిడ్స్ రోగులకు నెల రోజుల పాటు సరిపడా ప్రోటీన్ ఫుడ్ అందజేశారు. అలాగే ఉంగుటూరు అనాధాశ్రమంలోని



పిల్లలకు బిర్యానీ వడ్డించారు.

ఈ కార్యక్రమాల్లో రీ షి యూత్, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ నేత అప్పన్న దొర పుట్టిన రోజు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 16:** కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభ వంతుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని కేకును కట్ చేసి తినిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా దినోత్సవ సంబరాలకు ఆహ్వానం

**– మన్యం కవి నూనె రమేష్,**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.16:** శ్రీ శ్రీ కళావేదిక ఆగస్టు ముపై ఒకటోవ తేదీన ఆదివారం కొత్త రఘురామయ్య కాలేజీ ఆడిటోరియం నరసరావుపేట పల్నాడు జిల్లాలో తెలుగు భాషా దినోత్సవ సంబరాలకు మన్యం కవి నూనే రమేష్ కు ఆహ్వానం వచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవహారిక భాషోద్యమ పితామహు డు గిడుగు రామ్మూర్తి,జయంతిని పురస్కరించుకుని తెలు గు సాహిత్య సేవలను గుర్తించి తెలుగు భాషా పరిరక్షణ లో చేస్తున్న కృషికి గుర్తింపుగా పల్నాడు జిల్లా నరసరావు పేటలో జరిగే తెలుగుభాషా దినోత్సవ సంబరాలులో తెలు గు తేజం తెలుగు భాషా సేవా పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. మన్యం కవి నూనె రమేష్,కు జరగబో వు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన శ్రీ శ్రీ కళావేదిక చెర్మెన్,డాక్టర్ కత్తిమండ ప్రతాప్,మహిళా అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూ షణంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జరగబోవు తెలుగు భాషా దినోత్సవ సంబరాలకు ఆహ్వానం మన్యం కవి నూనె రమేష్,కు వచ్చి నందుకు



మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఇద్దరు డాక్టర్లు ఉండి ప్రయోజనం ఏమిటి...





- **హాస్పిటల్లో రక్త పరీక్ష పరికరాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు..**
- **ప్రవేట్ ఆసుపత్రికి వెళ్తే జేబులు గుల్ల చేస్తున్న డాక్టర్లు ..**

**ఎటపాక ,పెన్ పవర్,ఆగస్టు 16:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్ష పరికరాలు లేక ప్రవేట్ ఆస్పత్రులలో ఆశ్రయించండి అని చెప్తున్నా డాక్టర్లు, ఈ విషయంపై లక్ష్మీపురం గ్రామానికి చెందిన రంబాల. నాగేశ్వరరావు, వాట్సప్ గ్రూపుల ద్వారా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కి వినతి పత్రాన్ని గ్రూపుల ద్వారా చేరే విధంగా ఫార్వర్డ్ చేశారు, ఆయన పెట్టిన వాట్సాప్ ఈ విధంగా రాయబడి ఉంది, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐఏఎస్ , ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, డిఎంహెచ్వో డాక్టర్ పుల్లయ్యలకు నమస్కరించి వ్రాయు విన్నప పత్రము ,శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పిఓ, డిఎంహెచ్ఓలకు మా విన్నపము అయ్యా లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లు నియమించి ఉన్నారు, చాలా సంతోషం కానీ హాస్పిటల్ లో ఏ విధమైన రక్త పరీక్షలు లేనందున ఒక మలేరియా తప్ప, మిగతా టెస్ట్ లేవి కూడా ఇక్కడ చేయటం లేదు, ఈ విషయంపై డాక్టర్ ని అడుగగా ఇక్కడున్న రక్త పరీక్షలు చేయుటకు ఉపయోగించే పరికరాలు ఉపయోగపడటం లేదు,అవి చేయించడానికి ఇక్కడ సాధ్యపడదని తెలియజేశారు, ఇద్దరు డాక్టర్లు కూడా హాస్పిటల్లో ఉండే ప్రయోజనం లేకుండా అవుతుంది, ముఖ్యంగా ఈ మధ్యకాలంలో కురుస్తున్న వర్షాలు కారణంగా చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల్లో విపరీతమైన జ్వరాల తో ప్రజలందరూ బాధపడుతున్నారు, ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే పరిస్థితి ఈ రకంగా ఉంది, దీర్ఘకాలిక రోగులకు కిడ్నీ పరీక్ష చేయడానికి గాని ఇక్కడ ఏ విధమైన రక్త పరీక్షలు లేవు, డెంగ్యూ సిబిపి, టైఫాయిడ్ పరీక్షలు లేవు, ఏజెన్సీ ప్రాంతాల్లో లక్ష్మీపురం , నెల్లిపాక,గౌరిదేవిపేట హాస్పిటల్ లో గాని ఎక్కడ కూడా ఈ రకమైన వైద్య పరీక్షలు లేకపోవడం వలన గిరిజనులు అనేక రకమైన జబ్బులతో ప్రైవేట్ హాస్పటల్ వెళ్లే పరీక్షలు చేయించుకొని విపరీతమైన డబ్బులు ఖర్చు చేస్తున్నారు, మీరు స్వయంగా చింతూరు ఐ టి డి పి ఓ మీరు స్వయంగా లక్ష్మీపురం, నెల్లిపాక, గౌరీదేవిపేట పిహెచ్ సిలకు మీరు పర్యవేక్షించండీ మీకు హాస్పటల్లో ఉన్న పరిస్థితులు మీరు స్వయంగా చూడొచ్చు.దయచేసి ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలను కాపాడేందుకు త్వరగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాము.

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పొదలు తొలగింపు



**ఎటపాక ,పెన్ పవర్, ఆగస్టు 16:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలో గల సెంటెన్స్ పాఠశాల నుంచి ఎర్ర బోరు గ్రామం వరకు వెళ్లే రహదారి కి ఇరువైపులా పొదలు ఎపుగా పెరిగాయి.దాంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.కావున ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ గా ఉన్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే వారు.ముఖ్యంగా రాత్రి సమయంలో ఆ రహదారి లో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయపడుతూ వుండే వారు. ఆటో యూనియన్ జెఏసి అధ్యక్షులు మర్మం శంకర్,తన మిత్ర బృందం అయినా ఆటో యూనియన్ సభ్యుల సహకారం తో శ్రమదానానికి నడుం బిగించి ఆ రహదారి కి ఇరువైపులా వున్నా పొదలను తొలగించడం జరిగింది.ఆ ఇరువైపులా వున్నా పొదలను తొలగించడంతో రహదారిన వెళ్లే వాహనదారులు, గ్రామస్తులు, పలువురు రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి కాకాని సురేష్,తోట చిన బాబు రావు,నోముల కృష్ణ,నేత్రబోయిన వెంకన్నబాబు,గన్నబోయిన రాజు,జెట్టి హరి,దుద్దుకూరి రాము,కట్టాం వెంకటేష్, గోసుల రఘు, యడ్ల నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల త్యాగఫలం.. స్వేచ్ఛా భారత సౌరభం



**భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి పతాకాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.**

**ఏలూరు ఆగస్టు 16 పెన్ పవర్ :**

### మండల పరిషత్ కార్యాలయంలో

మహనీయుల త్యాగఫలం. స్వేచ్ఛా భారత సౌరభమని భీమడోలు మండల ఎంపీపీ కనకమాల రామయ్య అన్నారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రంగా భవాని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి వి ఎస్ వి శర్మ, డిప్యూటీ ఎంపీడీవో ఎస్. సుబ్బారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### భీమడోలు పంచాయతీలో

భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పాము సునీత జెండాను ఆవిష్కరించారు. ముందుగా భరతమాత, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శేషగిరిరావు, నీటి సంఘం అధ్యక్షులు ప్రసాద్, కూటమి



నాయకులు, పంచాయతీ కార్యదర్శి కే తనుజ, సచివాలయాల సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### పొలసానిపల్లి

పొలసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ షేక్ రహీమ బేగం జెండాను ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు మద్ది శ్రీను, మెరుగు రాజేష్, కోట గణపతి, పంచాయతీ కార్యదర్శి యు. జయ రామకృష్ణ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు అనంతమ్మ, వెంకట రమణమ్మ, భీమడోలు రామకృష్ణ, రాజారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చెట్టున పాడు

చెట్టున పాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మ, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, భరతమాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెను మచ్చ విజయదుర్గ, ఎంపీటీసీ వనమాల సుజాత, కోటమి నాయకులు ఎస్ గంగయ్య, ఎన్ అజయ్, ఎన్ రామరాజు, జనసేన కార్యకర్తలు ఎస్సీ, బీసీ సొసైటీ అధ్యక్షులు, గ్రామపంచాయతీ కార్యదర్శి స్ఫూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గుండుగొలను

గుండుగొలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపసర్పంచ్ జెండాను ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, భరతమాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొండబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కుమార్ (కొండబాబు) మాజీ డిసిసిబి డైరెక్టర్ బంటు విజయకుమార్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కూటమి నేతలు, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







# ఆర్ అండ్ బి రోడ్డు పునర్ నిర్మించే వరకు ఉద్యమం ఆగదు: గిరిజన గ్రామాల యువత.





- **రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డు నిర్మించాలని యువకుల ర్యాలీ, ధర్నా, రాస్తారోకో.**
- **యువకుల ఉద్యమానికి ఐదు గిరిజన గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల మద్దతు.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 16:** మండల పరిధిలోని రమణయ్యపేట, జే అన్నవరం వరకు సుమారు 12 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి నిర్మించి 20 సంవత్సరాల పై మాటే. అప్పటినుంచి ఇప్పటివరకు రాజకీయ పార్టీలు మాత్రమే మారుతున్నాయి. రోడ్డు దుస్థితి మారలేదు. పెద్ద పెద్ద గోతులతో కనీసం పాదచారులు కూడా నడవలేని కి వీలు లేని విధంగా ఛిద్రమైంది. ఎన్నికల వేళ ప్రతినాయకుడు ఆర్ అండ్ బి రోడ్డు పునర్నిస్తామని హామీలు ఇవ్వడం, లేనిపక్షంలో తామే స్వయంగా ధర్నా చేస్తామని చెప్పడం పరిపాటే. ఎన్నికలు అయిన తర్వాత గద్దెనెక్కిన ఎమ్మెల్యే ప్రజలకు ముఖం చాటేయడం సాధారణ విషయం అయిపోయింది.

ఏలేశ్వరం నుండి సుమారు 300 గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారి రమణయ్యపేట, గొటువానిపాలెం, జె అన్నవరం మీదుగా అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల గిరిజన గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. 20 సంవత్సరాలుగా నిర్మాణానికి నోచుకోని ఏలేశ్వరం నుండి నర్సీపట్నం రోడ్డుగా పిలవబడే ఆర్ అండ్ బి రహదారి అల్లూరి సీతారామరాజు , కాకినాడ రెండు జిల్లాలను కలపడానికి ప్రధాన రహదారి. గిరిజన గ్రామాల ప్రజలు ఏ అవసరం వచ్చిన ఏలేశ్వరం మీదుగా మైదాన ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ప్రాచుర్యం పొంది ఉంది. వివిధ గిరిజన మండలాల ప్రజలకు మైదాన ప్రాంతాలకు చేరుకోవడానికి ఇదే దగ్గర దారి. అయితే అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో 20 సంవత్సరాలుగా ఏ అభివృద్ధికి నోచుకోక పెద్దపెద్ద గోతులతో, వర్షం వస్తే ఏది గొయ్యో ఏది రహదారో తెలియని పరిస్థితి. దుస్థితిలో ఉన్న రహదారిపై తప్పని పరిస్థితుల్ల ప్రయాణం చేసిన వాహనదారులు యాక్సిడెంట్లకు గురై ఆస్పత్రిపా లవుతున్నారు. నిండు గర్భిణీలు వైద్యం కోసం ఏలేశ్వరం ఆసుపత్రులకు వచ్చే రహదారిలోనే ప్రమాదాల బారిన పడుతున్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు ఏలేశ్వరంలో గిరిజన పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీలు ఉన్నప్పటికీ గోతుల రోడ్డు పై ప్రయాణం చేయలేక మధ్యలోనే చదువులు మానుకుంటున్నారు. గోతుల్లో పడి అనేక వాహనాలు దెబ్బతింటున్నాయని ఆర్టీసీకి తీవ్ర నష్టం వస్తుందని అధికారులే గతంలో ప్రకటించారు. ఆటో, 4 చక్రాల వాహనదారులు ఈ ఆర్ అండ్ బి రహదారిపై ప్రయాణం వల్ల వాహనాలు ప్రమాదానికి గురవడంతో పాటు రిపేర్ కి వస్తున్నాయని, దీంతో ఆర్థికంగా చాలా నష్టపోతున్నా మన్నారు. ద్విచక్ర వాహనదారులైతే యాక్సిడెంట్ లకు గురై ఆసుపత్రిపాలవుతున్నారు.

రమణయ్యపేట నుండి జే అన్నవరం వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కొబ్బరికాయ కొట్టి ఆర్ అండ్ బి అధికారులను వారం రోజుల్లో రోడ్డు పనులు మొదలెట్టమని ఆదేశించారు. కానీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి సుమారు 14 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదు.

ఈ మేరకు రమణయ్యపేట, జే అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, కిమ్మూరు, గుంటువానిపాలెం గ్రామాలకు చెందిన గిరిజన యువకులు ఉద్యమిస్తే గాని పాలకులు దిగిరారని శనివారం ఉద్యమ బాట పట్టారు. తూర్పు లక్ష్మీపురం నుంచి ర్యాలీగా వచ్చి రమణయ్యపేట ఫారెస్ట్ ఠానా వద్ద ధర్నా చేపట్టారు. సుమారు ఐదు గంటలపాటు గిరిజనులు రాస్తారోకో నిర్వహించడంతో, ఏలేశ్వరం పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసనకారులను సంప్రదించారు. శాంతియుతంగా నిరసన తెలుపుకోవాలి తప్ప రాస్తారో అంత చేయరాదని హితవు పలికారు. రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే, ఆర్ అండ్ బి అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.





# కోటిపల్లిలో అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి.



**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 16:**కె గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించగా,ముఖ్య అతిథిగా కర్రి చిట్టిబాబు హాజరై వాజపేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజపేయి నిస్వార్థ పౌరుడు,గొప్ప రాజనీతిజ్ఞుడు, కవి, ఉత్తమ పార్లమెంటేరియన్ అని కొనియాడారు.ఆయన ప్రధానిగా గ్రామాల అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని, గ్రామీణ సడక్ యోజన ద్వారా రహదారులు, డ్రైనేజీలు నిర్మించిన ఘనత వాజపేయిదేనని గుర్తు చేశారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల్లో తరగతి గదులు, బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని, అలాగే గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు మంజూరు చేసిన క్రెడిట్ ఆయనదేనని వివరించారు.అదేవిధంగా స్వర్ణ చతుర్భుజ పథకం ద్వారా జాతీయ రహదారులను ఫోర్‌వేలు, సిక్స్‌వేలు గా అభివృద్ధి చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించిన ఘనత కూడా వాజపేయిదేనని తెలిపారు. తన కవితా చాతుర్యంతో, అనర్గళ ప్రసంగాలతో పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి గుబులు పుట్టించిన మహానుభావుడని ఆయనను స్మరించారు.ఈ కార్యక్రమంలో గుర్రాల సత్యన్నారాయణ, ఎ.వి. రమణమూర్తి, సలాది శేఖర్, కౌలూరి వెంకటకృష్ణ, రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, ఎ. నారాయణమూర్తి, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి గొడవర్తి రామకృష్ణ, గ్రామ పెద్దలు దొరయ్య, కూటమి నాయకులు పాల్గొని వాజపేయి సేవలను స్మరించారు.

# వాడపల్లి ఆలయంలో సెల్‌ఫోన్ భద్రతా లోపాలపై భక్తుల ఆగ్రహం

- దేవుని దర్శనం కన్న సెల్ దర్శనం కష్టం
- దూర ప్రాంతాల నుండే వచ్చే భక్తులకు ప్రయాస తప్పదా..!!
- భద్రత లో భారం







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 16:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ముఖ్యంగా ఏడువారాల నోము నోసుకొనే భక్తులు ఎంతో కష్టపడి స్వామి వారి ఆలయానికి చేరుకుని దర్శనం చేస్తున్నారు.

అయితే, స్వామి దర్శనం సజావుగా జరిగినప్పటికీ సెల్‌ఫోన్ భద్రతా వ్యవహారంలో లోపాలు భక్తుల్లో అసంతృప్తిని కలిగిస్తున్నాయి. ఆలయానికి విచ్చేసే భక్తుల మొబైల్ ఫోన్లను భద్రపరిచే క్రమంలో తగిన సౌకర్యాలు, భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఫోన్లు తిరిగి తీసుకునే సమయంలో క్రమబద్ధత లేకపోవడం, సురక్షితమైన భద్రపరిచే సదుపాయాలు లేకపోవడం భక్తులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని వారు ఆలయ అధికారులను కోరుతున్నారు.భద్రత బాధ్యత లేనిదే తీసుకోవడం భావ్యం కాదని భక్తులు ఆవేదన చెందుతున్నారు.తిరుమల లో లేని నిబంధనలు టెండర్లు మన వాడపల్లి వెంకన్నకు ఎందుకని భక్తులు ప్రశ్నిస్తున్నారు.ఆదాయం వచ్చిన ఎందుకు ఇలా చేస్తున్నారని ఆలయ అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**కిర్లంపూడి, పెన్ పవర్, 16:**శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. భక్తులతో రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. భజనలు, సంకీర్తనలతో ఆలయాలు మారుమోగాయి ఏకాహ మహోత్సవం పలు గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. సింహాద్రి పురం గ్రామం కృష్ణాలయం వీధిలో గల కృష్ణుడు ఆలయంలో కందా మణిదీప్ సతీమణి సుధా దంపతుల చే విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కందా సత్యానందం సతీమణి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్తులతో ఆలయం కిక్కిరిసింది. అనంతరం ప్రసాద వితరణ చేశారు

# నిర్వాసితుల భూముల్లోకి బ్యాక్ వాటర్ వచ్చే వరకు అండగా కూటమి





- నిర్వాసిత రైతుల భూములకు అండగా ఉంటామన సిపిఎం హామీ మరిచిందా
- పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాన్ని వమ్ము చేస్తారా పాయం

**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 16.**రాజకీయ లబ్ధి కోసం నిర్వాసిత గిరిజనేతర భూములను ఆక్రమించడం సిపిఎం ఆపాలని టేకులబోరు సినిమా హాల్ నందు పాయం వెంకయ్య అధ్యక్షతన జరిగిన జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాయం అన్నారు.పూర్తి ప్యాకేజీ రాని గిరిజనేతర పోలవరం నిర్వాసిత రైతులను భూస్వాములుగా చిత్రకరించి సిపిఎం,గిరిజన సంఘం జెండాలు నిర్వాసిత రైతుల భూములలో పాతటం ఆపాలని బిజెపి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వైసిపి,టిడిపి,కాంగ్రెస్,ఏవిఎస్ పి నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు ప్రసంగిస్తూ సిపిఎం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఆధ్వర్యంలో జరిగిన పోలవరం నిర్వాసిత పాదయాత్రలో బ్యాక్ వాటర్ వచ్చేవరకు గిరిజన,గిరిజనేతరులకు రక్షణగా,అండగా సిపిఎం ఉంటుందని ఇచ్చిన హామీ మర్చిపోయారా?అని ప్రశ్నించారు.నిర్వాసితులకు పూర్తి న్యాయం జరగాలంటే సిపిఎం గెలిపించమని కోరి,గెలిపించాక న్యాయం ఎందుకు చేయలేదు,మీది నమ్మక ద్రోహం కాదా అని ప్రశ్నించారు.సిపిఎం రోజుకో మాట,రోజుకో నినాదం చేస్తూ గందరగోళంలో ఆ పార్టీ ఉందని,సిపిఎం రెచ్చగొట్టే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గిరిజనేతర నిర్వాసితుల తరఫున కూటమి ప్రభుత్వం బ్యాక్ వాటర్ వచ్చే వరకు అండగా ఉంటామని వ్యవసాయ భూముల్లో పాతిన జెండాలు సిపిఎం తీయకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి లు మోదుగు పెరమయ్య,కామేశ్వరి,టిడిపి నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఎడవల్లి భాస్కర్,గాదేసుల ప్రేమ్ చందు,వైసీపీ జిల్లా బీసీ సంఘం కార్యదర్శి ఆవుల మరియదాసు,విఆర్ పురం వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు,మాచర్ల గంగులు,చిక్కాల బాలకృష్ణ, బొడ్డు సత్యనారాయణ, పొడియం గోపాల్,కాపురపు ఉమా,మోడెం నరేష్,ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్,సోడే ముత్తయ్య, మోత్కూరి వెంకన్న,చింతూరు బిజెపి మండల మాజీ అధ్యక్షులు రమణారెడ్డి,బొల్లా ప్రసాద్,కరక పవన్,ముత్యాల రాంబాబు,గూటాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రకృతి వరప్రసాద పండుగ తీజ్

**బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో**

**టీ.నర్సాపురం, పెన్ పవర్, ఆగస్టు 16 :**బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో బంజారాల తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకసందర్భముగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోరు బంజారా ఆడబిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరాల పండుగ తీజ్ అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంజారాలు ఈ తీజ్ పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించుకుంటారని అన్నారు. పుట్టినిల్లుకీర్తినిమెట్టినిల్లుప్రతిష్టను పెంచేలా చిన్నప్పటినుండి ఆడబిడ్డలకు నడవడికను నేర్పే పండుగ తీజ్ అని అన్నారు.

జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టాలను ఓర్చుకుంటూ, సహనంతో జీవించేలా బతుకు పాఠంను తీజ్ పండుగ నేర్పుతుందని అన్నారు.

సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాల తండాల్లో పాడిపంటలు మెండుగా ఉండాలని, సిరిసంపదలు నిండుగా ఉండాలని ఆడపిల్లలు కలలు కంటూ సాత్ భవానీల ఆశీస్సులు కోరుతూ చేసుకునే వేడుక తీజ్ అని అన్నారు.



తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డబ్బులతో, సాంస్కృతిక బంజారానృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ రాళ్ల చెరువులో నిమజ్జనం చేశారు.



తీజ్ దీక్ష చేసిన 20 మంది ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో మూడు శ్రీనివాస్ నాయక్, ధరావత్ బంగారయ్య, భూక్యా భిగనాదం, భూక్యా సురేష్, జరభల కృష్ణ లీల, భూక్యా ధనలక్ష్మి, భవాని, లావుడియా సంధ్య,. ఆడబిడ్డలు తల్లిదండ్రులు, తదితరులుపాల్గొన్నారు.

# రైతులు బాగుంటేనే సమాజాభివృద్ధి.

- అండగా నిలిచేది కూటమి ప్రభుత్వం.
- ఎమ్మెల్యే వేగుళ్ళ.

**మండపేట.పెన్ పవర్.ఆగస్టు 16:**రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం ప్రగతి సాధ్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. రైతు సంబరాలు కార్యక్రమం అనంతరం మండపేట పుర పాలక సంఘం కార్యాలయం వద్ద ఆయన మీడియా తో మాట్లాడుతూ రైతులు కన్నీరు పెట్టని సమాజం లక్ష్యంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో, వారికి పెట్టుబడి సాయం అందించి సహకరించాలని ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కిసాన్ సమ్మాన్ నిధి తో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ఏడాదికి 20 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని రైతులకు అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో సకాలంలో పెట్టుబడి కి డబ్బులు లేక, పండించిన తర్వాత ఆ ధాన్యాన్ని కొనేవారు లేక, ఒకవేళ ప్రభుత్వం కొన్న సకాలంలో డబ్బులు చెల్లించక రైతులు పడుతున్న ఇబ్బందులు అర్థం చేసుకొని కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు పండించిన ధాన్యం కొన్న 48 గంటల్లోపే నగదు బదిలీ జరిగేలాగా చేయడమే కాకుండా, గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ1,674 కోట్లు నిధులు కూడా చెల్లించి చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ20 వేలు అందిస్తామని చెప్పిన సూపర్ సిక్స్ హామీలో భాగంగా, తొలి విడతగా కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అందిస్తున్న రూ2,000 తో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ 5,000 కలిపి మొత్తంగా రూ 7,000 రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. భవిష్యత్తులో మిగతా మొత్తం మరో రెండు విడతల్లో జమ చేసి రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. రైతు పక్షపతిగా వ్యవహరిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి,పుత్సల శ్రీనివాస్, యరగతపు బాబ్జీ,మాదిగ కార్పోరేష్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ దొరబాబు, టిడిపి, బిజెపి, జన సేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# రైతులు ఉత్సాహం.

- ఆకట్టుకున్న ట్రాక్టర్ ర్యాలీ.
- ఎమ్మెల్యే వేగుళ్ళ కు బ్రహ్మారథం.

**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 16** :మండపేట మండలం ఆర్త మురు లో నిర్వహించిన రైతు సంబరాలు లో నియోజక వర్గ వ్యాప్తంగా రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు రెండువందల ట్రాక్టర్ లు ఊరేగింపు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. రైతులు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు బ్రహ్మారథం పట్టారు.మండపేట వంతెన, రాజరత్న సెంటర్, బస్ స్టాండ్ సెంటర్, కరాచీ సెంటర్, కలువపువ్వు సెంటర్ వరకు వరసగా ట్రాక్టర్ లు ఊరేగింపు నిర్వహించారు. ట్రాక్టర్ లకు బెలూన్ లు టిడిపి, బీజేపీ, జన సేన జెండాలు అలంకరించారు. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా టౌన్ ఎస్ ఐ బి రాము అధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిపి, బీజేపీ,జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు.



# రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలి

**గంగవరం ఎస్ఐ వెంకటేష్**



**గంగవరం, పెన్ పవర్ ,ఆగస్టు 16:**ఆటో యజమానులు ఆటోలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని గంగవరం ఎస్సై వెంకటేష్ సూచించారు. శనివారం స్థానిక హనుమాన్ ఆటో యూనియన్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు యజమానులతో సమావేశం నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దని సూచించారు. అలాగే మాదకద్రవ్యాలు గంజాయి సారాయి వంటి నిషేధిత సరుకులను రవాణాకు సహకరించవద్దని కోరారు. జాతీయ రహదారిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ,అత్యవసరమైతే ప్రయాణికులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఆటోలకు డ్రైవర్లకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహర్షి ,గంగవరం పోలీస్ సిబ్బంది, హనుమాన్ ఆటో యూనియన్ నాయకులు రాంబాబు, రమణ, సుబ్బు, రాధాకృష్ణ, చిట్టిబాబు తదితరులున్నారు.

## జగ్గంపేట సి.హెచ్.సి సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్ కు ఉత్తమ సేవా పురస్కారం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 16** : జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రణీత్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆయన సేవలను అభినందిస్తూ రోగులకు సకాలంలో వైద్యం అందిస్తున్నందుకుగాను కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా బెస్ట్ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఆసుపత్రి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.16**

మండలంలోని రాజుపేట కాలనీ,వడ్డిగూడెం,వి.ఆర్.పురం,రేఖపల్లి,గొల్లగూడెం,సీతంపేట,శ్రీరామగిరి తదితర గ్రా మాలలో శనివారం గ్రామ పెద్దలు సమక్షంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.రాజుపేట కాలనీలో శ్రీకృష్ణుని వేషధారణలో విద్యార్థులు పాల్గొన్నారు.పందిరి కి ఉట్టి కట్టి కొట్టి గ్రామస్తులందరూ కృష్ణాష్టమిని నిర్వహిం చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కృష్ణుని గురించి శ్రీ కృష్ణాష్టమి ప్రాముఖ్యతను గురించి ప్రజలందరికీ అర్థమ య్యేలా,హిందూ మతంలో శ్రీ కృష్ణుడి పుట్టిన రోజుగా జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగని,ఇది భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే పవిత్ర వేడుకగా వర్ణించారు. పండుగ రోజున,ప్రజలు ఉపవాసం ఉంటారని,ప్రత్యేక పూజలు చేస్తారని, తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,భక్తులు,గ్రామాల ప్రజలు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణ జన్మాష్టమి జరుపుకున్న యాదవులు



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 16:** శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించా రు.తంటికొ ఒడ,పెంటపల్లి, తిరుమలాయపాలెం గ్రామాల్లో యాదవులు తమ కులదైవం శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలను ప్రత్యేక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా జరుపుకున్నారు.శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం యువకులు ఉల్లాసంగా ఉట్టి కొట్టే కార్యక్రమం జరుపుకున్నారు గోకవరంలోని గీతా మందిరం వద్ద సూర్యపీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో అలరించగా అష్టోత్తర సహిత పాలాభిషేకం, విష్ణు సహస్రనామ పారాయణ, ఉట్టికొట్టు కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్ట్ 16 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు పదిహేను వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,47,160, అన్నదాన విరాళాల ద్వారా రూ. 69,570, కేశ ఖండన ద్వారా రూ. 4080, తులాభారం ద్వారా రూ. 300, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 16,935, మొత్తం రూ. 2,38,045 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు మూడు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్టు 16 :** భారతీయ సంస్కృతి సంప్రదాయాలు మహోన్నతమైనవని, వీటిని భావితరాలకు అందించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని భగవద్గీత ప్రచార సేవా సమితి అధ్యక్షులు, సనాతన ధర్మ గీతా ప్రచారకులు మల్లిఖార్జునస్వామి అన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని స్థానిక సత్తిరెడ్డిపేటలో గల భగవద్గీత నిలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భగవద్గీత శ్లోకాలు, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మల్లిఖార్జునస్వామి ప్రసంగిస్తూ సమస్త లోక పాలకుడు, యశోదానందనుడు ధర్మాన్ని స్థాపించి అధర్మాన్ని, అన్యాయాన్ని అంతం చేసిన పవిత్ర జగద్గురువు, అవతారమూర్తి దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు గోలోక బృందావనం నుంచి భూలోకానికి దిగివచ్చిన పర్వదినం శ్రీకృష్ణాష్టమిని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నామని అన్నారు. లోకంలో అధర్మం ప్రబలి ధర్మం క్షీణించినప్పుడల్లా తాను అవతరిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో వాగ్దానం చేశాడని, ప్రస్తుత కలియుగంలో శ్రీకృష్ణుడు నామ రూపంలో అవతరిస్తాడని శాస్త్రాలు పేర్కొన్నాయని అన్నారు. ప్రస్తుత యుగంలో కృష్ణావతారం శబ్దరూపంలో ఉంటుందని, ఎవరైతే ఈ కృష్ణ నామాన్ని జపిస్తారో వారు కృష్ణావతార ప్రత్యక్ష సన్నిధానంలో ఉన్నట్లేనని చెప్పారు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవని, మానవుడి ప్రతీ దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడని ఆయన వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు నేతి వీరభద్రరావు, కార్యదర్శి సత్యకుమార్, గౌరవ సభ్యులు ఉండవల్లి సూరిబాబు, మీనాక్షి, అన్నపూర్ణ, గండ్రేటి త్రిమూర్తులు, విజయనిర్మల, గొర్రెల చిన్నారావు, గంధం రామకృష్ణ, గుడివాడ అర్చకులు తుట్టగుంట సుదర్శనరావు, మేడిశెట్టి నూకాపతిరావు, నాయుడు ప్రకాశరావు, మహిళా సభ్యులు విజయకుమారి, శ్రీదేవి, వేద గీతామృత, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరపురం లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కపిలేశ్వరపురం, పెన్ పవర్, ఆగస్టు 16** :కపిలేశ్వరపురం మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే వైష్ణవ ఆలయాలు, శ్రీకృష్ణ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సర్వాంగ సుందరంగా అలంకరించగా, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, బహుమతుల ప్రదానంతో ఉత్సవాలు మరింత ఆకర్షణీయంగా మారాయి. సాయంత్రం ఉట్టి కొట్టే సందడి భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కేదార్లంకలో నిర్వహించిన వేడుకలు విశేషంగా నిలిచాయి.ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీకృష్ణునికి ఉట్టికి పూజలు నిర్వహించగా, అనంతరం మహిళలు, యువతులు భక్తి శ్రద్ధలతో కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజానికి ఆత్మీయత, ఐక్యతను అందిస్తాయని పేర్కొన్నారు. నిర్వాహకులను ఆయన అభినందించారు.తరువాత గ్రామ పెద్దలు సత్యానందాన్ని పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బౌద్ధ ప్రముఖ టిఆర్ఎస్ ఆంజనేయులు, బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి పాలూరి జయప్రకాశ్ నారాయణ, బిజెపి నాయకులు కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, భమిడిపాటి లక్ష్మీనారాయణ, కోటిపల్లి దామోదర్, శ్రీఘాకోళ్ళపు చిన సుబ్బారాయుడు, కేదార్లంక మాజీ సర్పంచ్ రంకిరెడ్డి వెంకటేశ్వరరావు,గ్రామ పెద్దలు అన్యం గోవిందు, అన్యం నానాజీ, సాదా వీరన్న, పోలిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.భక్తులు, మహిళలు, యువతులు అధిక సంఖ్యలో హాజరై కృష్ణజన్మాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.



## రాజాకు ఉత్తమ సేవా పురస్కారం



**పెద్దాపురం, పెన్ పవర్, ఆగస్టు 16 :** కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ సిసిగా విధులు నిర్వహిస్తున్న కరెడ్ల రాజాకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జిల్లా కేంద్రం కాకినాడలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సకిలి, తదితర అధికారులు రాజాను అభినందించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.








**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 16:**కె గంగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ని కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాలను చిన్న పిల్లలచ్చే కృష్ణుడు వేషధారణ వేయించి కృష్ణుడుల అలంకరించి.ఆడపిల్లలను గోపికలుగా వేషధారణలో అలంకరించి. చిన్ని కృష్ణయ్య కు వెన్నముద్దలు కలిపి పెట్టి ఆ చిన్నారి లో కృష్ణుని చూసి తల్లిదండ్రులు ఆనందపడినారు. కె గంగవరం మండలం కోట గ్రామంలో గుత్తికొండ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం చెల్లి వారి వీధి సెంటర్లో యాదవులచే ఉట్టి కొట్టించారు.అదేవిధంగా కోటిపల్లి గ్రామంలో కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు మార్కెట్ సెంట్ లో సాయంత్రం ఉట్టు కొట్టారు.

# రాజుపాలెంలో ఇసుక లారీ బోల్తా.

- వాహనాలుభారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం.
- ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్న కిర్లంపూడి పోలీసులు





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 16** :కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామ శివారులో దివిలి వైపు నుండి భారీ ఇసుక లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. దీంతో రెండు వైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కిర్లంపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తీవ్రతరం లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

# విద్యుత్తు అంతరాయాలకు ముందస్తు చర్యలు

**సూపర్డెంట్ ఇంజనీర్ రాజేశ్వరి**

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16** :కోనసీమ జిల్లాలో భారీ వర్షాలు దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. రాజేశ్వరి, కోనసీమ పరిధిలోని 22 మండల అధికారులను అప్రమత్తం చేశారు.

ఈ నేపథ్యంలో అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని ఈఈలు, డీఈఈలు, ఏఈలకు ఆదేశాలు ఇచ్చారు.

భారీ వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపోవడం, స్తంభాలు పడిపోవడం,లైన్లపై చెట్ల కొమ్మలు పడిపోవడం వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

విద్యుత్ సంబంధిత అత్యవసర సమాచారం కోసం కింది నంబర్లను సంప్రదించవచ్చు:

టోల్‌ఫ్రీ నంబర్: 1912 కోనసీమ

కంట్రోల్ రూమ్: 9440904477

ప్రజల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మాజీ చైర్ పర్సన్ విరితాదేవి హార్థిక సహాయంతో విద్యుత్ అలంకరణ**







**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 16** :శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ చైర్ పర్సన్ దూడల విరీతాదేవిఫణి ల ఆర్థికసహాయంతో,పిరమిడ్ స్ప్రిచువల్ సొసైటీ సభ్యులచే ఏర్పాటు చేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆలయంలో స్టేజ్ ప్రాంతం విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేక డెకరేషన్‌లతో ముస్తాబుచేశారు తల్లిదండ్రులు తమ చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాలు వేయించి తీసుకుని,వచ్చారు.చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులచే నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.అనంతరం ఉట్టిని కొట్టారు.ఈ కార్యక్రమంలో దూడల విరీతాదేవి, దూడలఫణి, కొవ్వూరి గాయత్రీ, యెందూరి సీత, పప్పోప్పుల ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా







**ఏలూరు ఆగస్టు 16 పెన్ పవర్:** 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ గ్రామాన మువ్వన్నెల జెండా ను ఎదురు వేశారు పంచాయితీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏఎంసి , రెవెన్యూ, ఎంఈఓ, పోలీస్ సర్కిల్ కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**గుడివాక లంక**

ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామంలో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ భరతమాత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పెద్దలు ఘంటసాల నాగరాజు నేపాల కాత్యాయని జగపతిబాబు మోరు విజయరామరాజు జయ మంగళ దొరబాబు గంటసాల సుబ్బు ఘంటసాల భద్రాచలం ఘంటసాల కుటుంబరావు గ్రామ పెద్దలు పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ పంచాయతీ సిబ్బంది, బంటా పెద్దలు పాల్గొన్నారు.



**దుగ్గిరాల**

పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ భరతమాత బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంజా క్రీస్తుమణి, ఉపసర్పంచ్ చింతమనేని శివగోపాల్, పంచాయతీ కార్యదర్శి రాజా సాయి కృష్ణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎం నాగులపల్లి**

ద్వారకాతిరుమల మండలం ఎం నాగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ సర్పంచ్ వై సునీల్ కుమార్ మహాత్మా గాంధీ భారతమాత బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి బాలామణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం.

**ప్రజా దర్బార్ నిర్వహించిన ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి**



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 16. పెన్ పవర్.** మండలంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు శనివారం నాడు కురుపాం శాసన సభ్యురాలు మరియు ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి ప్రజాదర్బార్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యే కు వినతి పత్రలు అందజేశారు.ఆమే సానుకూలంగా స్పందించి సమస్యలను క్షుణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం ఇచ్చి ఈ సమస్య త్వరగా పరిష్కారం అవ్వాలని,అధికారులకు ఆమె సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని. నియోజకవర్గంలో ఏ సమస్యలున్న నా వద్దకు తెలియజేయాలని ఆమె ప్రజా దర్బార్ కు విచ్చేసిన ప్రజలతో అన్నారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు,కూటమి నాయకులు,కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టిడిపి అనుబంధ సంఘాల కమిటీ ఎన్నికలు



**పార్టీ మద్దతుతో 18 అనుబంధ సంఘాలకు నాయకుల ఎంపిక**

గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగష్టు 16:మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో జీకే వీధిలో 18 అనుబంధ సంఘాల కమిటీలకు ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని 16 పంచాయతీలకు చెందిన టిడిపి కార్యకర్తలు, సీనియర్ నాయకులు భారీగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతి అనుబంధ సంఘానికి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పార్టీ ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ముఖ్యంగా,టీఎన్ఎస్ఎఫ్ కు గుంట బుజ్జిబాబు (అధ్యక్షుడు),ముక్కాలి ఐశ్వర్య (ప్రధాన కార్యదర్శి) ఎంపికయ్యారు.అంగన్‌వాడి విభాగానికి మామిడి నాగేంద్ర, సిరి బాల సంతోష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. తెలుగు యువతకు ముర్ల కోటేశ్వరరావు, దేశగిరి గంగాధర్, వర్తక సంఘానికి రాజారపు రాజులు, ఐటీడీపీకి ముర్ల భూపతి, సాగిన అనిల్ కుమార్, తెలుగు రైతు విభాగానికి కీల్లో సింహాచలం నాయకత్వం వహించనున్నారు.లీగల్ సెల్‌కు ముక్కలి మహేష్, ఎస్టీ సెల్‌కు పోతురాజు కృష్ణ, తిరుపల్లి మన్మధరావు, ట్రైకర్ విభాగానికి మొట్టడం రాజబాబు బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో కొర్ర బలరాం, ముక్కలి మహేష్, మామిడి నాగేంద్ర, మొట్టడం వీర వెంకట ప్రసాద్, పాడి శ్రీనివాస్, లువ్వాబు మత్స్యరాజు, దేశగిరి గోవింద్, కొండముల గోవింద్, లకే రామారావు, ముర్ల భూపతి, కాకూరి వెంకటరమణ, పాడి కృష్ణ కుమార్, బేరా రాజబాబు, మొట్టడం శరబాన్నదొర, సాగిన రంగారావు, మామిడి చంటిబాబు, వేముల శ్రీను, కొర్రపోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ వార్నింగులు. ఎవరూ పట్టించుకోవట్లేదా ..!



**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయాల్లో ఉన్న నాయకులు విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం తప్పుకాదు. కానీ, లెక్క పత్రం లే కుండా... చేసే విమర్శలను ఎవరూ హర్షించరు. పైగా.. బలమైన కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు మరింత ఆలోచించుకుని వ్యవహరించాలి. ఒక మాట అంటే.. నాలుగు మాటలు ఎదురు వచ్చే పరిస్థితి వైసీపీకి ఎదురవుతోంది. ఈ విషయాన్ని నాయకులు లైట్ తీసుకుంటున్నారో.. లేక.. ఏం జరుగు తోందో తెలియదు కానీ, వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు గాలి వాటంగా ఉన్నాయన్న విమర్శలు వస్తు న్నాయి.పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి మాజీ మంత్రి అంబటి చేసిన వ్యాఖ్య లు బూమరాంగ్ అయ్యాయి. ఎక్కడో వేరే రాష్ట్రంలో జరిగిన ఎన్నికల రిగ్గింగ్ దృశ్యాలను ఇక్కడ జరిగినట్టు గా ఆయన పోస్టు చేయడం.. వాటికి వ్యాఖ్యానాలు కూడా జోడించడం.. పార్టీని అభాసుపాల్జేసింది. ఈ పరి ణామాలపై పార్టీ అంతర్మథనం చెందే పరిస్థితి వచ్చింది. కానీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిం ది. ఈ ఒక్కటే కాదు.. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించకుండానే.. ఈ పథకం ఫెయిల్ అయిందంటూ .. వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.కానీ, సీఎం చంద్రబాబు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన తర్వాత.. మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేతలు అప్పటి వరకు చేసిన విమర్శలు గాలికి కొట్టుకుపోయాయి. నిజానికి ఏదైనా పథకంపై విమర్శలు చేయాలని అనుకున్నప్పుడు ఖచ్చితమైన లెక్కలు వేసుకుని ముందుకు సాగాలి. ఆధారాలతో ముందుకు రావాలి. లేకపోతే.. ఏ పార్టీకైనా ఇబ్బందులు తప్పవు. అసలే వైసీపీపై ఇంకా ఇంకా వ్యతిరేకత ను పెంచే క్రమంలో కూటమి ప్రభుత్వం దూకుడుగా ముందుకుసాగుతోంది. 11 సీట్లే వచ్చాయి కదా.. అని వైసీపీని వదిలి పెట్టడం లేదు.ఈ నేపథ్యంలో వైసీపీ వేసే ప్రతి అడుగూ కీలకంగా మారాల్సిన అవసరం ఉందని సీనియర్లు చెబుతున్నా రు. ఏదో మీడియా ముందుకువ చ్చి అన్నామంటే అన్నాం అన్నట్టుగా విమర్శలు చేస్తే.. ప్రయోజనం ఉండకపోగా.. పార్టీకి మరింత చేటు వస్తుందని కూడా చెబుతున్నారు. పార్టీ అధినేత జగన్ సైతం.. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న విమర్శలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇటీవల వర్షాలకు పొలాల్లోకి నీరు చేసింది. ఆ వెంటనే కలెక్టర్‌రైతులకు పరిహారం ఇచ్చేశారు. మరి ఈవిషయం తెలిసో.. తెలియకో జగన్ విమర్శలు చేశారు. కానీ, అవి విఫలమయ్యాయి. ఇలా.. వైసీపీ చేస్తున్న పనులు ఆ పార్టీకి ఎదురు తిరుగుతున్నాయన్న చర్చ జోరుగా సాగుతుండడం గమనార్హం.

# భారత్ పై ట్రంప్ పగటి కలలు ఎప్పటికీ నెరవేరవు



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్, రష్యా దేశాల మధ్య చమురు వ్యాపారంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రష్యాకు పెద్ద కొనుగోలుదారు అయిన భారత్ ఆ దేశానికి దూరమైందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, గణాంకాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ ప్రయోజనాల ఆధారంగా భారత్ తన విధానాలను రూపొందించుకుంటుందనే వాస్తవాన్ని ఈ వ్యాఖ్యలు విస్మరించాయి.

**ట్రంప్ వ్యాఖ్యలు**

ట్రంప్ తన ఒక ఇంటర్వ్యూలో "భారత్ రష్యాకు పెద్ద మద్దతుదారు కాదు, రష్యా తన అతిపెద్ద వినియోగదారుని కోల్పోయింది" అని వ్యాఖ్యానించారు. పుతిన్‌తో జరగబోయే శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాకుండా, అవసరమైతే "సెకండరీ టారిఫ్‌లు" విధించడానికి వెనుకాడబోనని, అది "వినాశకరమైన" నిర్ణయం అయినప్పటికీ అమెరికా ప్రయోజనాల కోసం అమలు చేస్తామని హెచ్చరించారు.

**వాస్తవాలు**

ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా, భారత్ రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించలేదు. కెప్లెర్ నివేదికల ప్రకారం, జూలైలో భారత్ రోజుకు 16 లక్షల బ్యారెల్ల చమురు కొనుగోలు చేయగా, ఆగస్టులో అది 20 లక్షల బ్యారెల్లకు పెరిగింది. ఇది భారత్ తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా వ్యవహరిస్తుందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు ఆర్థికంగా లాభదాయకం. అంతేకాక, చమురు సరఫరాదారుల జాబితాలో అమెరికా ఐదవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ మాటలు వాస్తవాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.

**- అంతర్జాతీయ సంబంధాలు, జాతీయ ప్రయోజనాలు**

ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా చోటు చేసుకునే పరిణామాలు, యుద్ధాలు, ఆర్థిక పరిస్థితులు ఆయా దేశాల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. ఈ విషయంలో భారత్ కూడా అదే చేసింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుండి రాయితీ ధరల వద్ద చమురు లభించడం భారత్‌కు ఒక గొప్ప అవకాశం. ఇది భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.

**భవిష్యత్తు సవాళ్లు**

ట్రంప్ "సెకండరీ టారిఫ్‌లు" విధించే హెచ్చరిక ఒక తీవ్రమైన సవాల్. అయినప్పటికీ, అంతర్జాతీయ చట్టాలు, వాణిజ్య ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటే అటువంటి చర్యలు అంత తేలిక కాదు. ఒకవేళ అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే అది ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (%ఔ%) వంటి సంస్థలు ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తాయి.డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు అతని రాజకీయ ఆలోచనలకు, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండవచ్చు. కానీ అవి వాస్తవాలను, గణాంకాలను ప్రతిబింబించడం లేదు. భారత్ వంటి దేశాలు కేవలం ఇతర దేశాల ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాయనేది స్పష్టం. కాబట్టి, భారత్‌పై ట్రంప్ చూస్తున్న 'పగటి కలలు' ఎప్పటికీ నెరవేరవు.

# అమ్మతనం అంగడి సరుకు చేస్తున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:**సంతానం పొందాలనేది ప్రతీ దంపతుల కల.. తమ ఒడిలో పిల్లలను ఆడించాలని తహతహలాడుతుంటారు. మారుతున్న జీవిన శైలి.. ఉద్యోగ, వ్యాపార ఒత్తిళ్లు, వాతావరణ పరిస్థితులు, జన్యు లోపాలు, ఇతర అంశాల కారణంగా కొంత మంది దంపతులు సంతానానికి దూరమవుతున్నారు. అయితే ఈ సమస్య ఏటేటా పెరుగుతూ వస్తుండడం ఆందోళన కలిగించే అంశమే. అయితే సంతానం పొందలేని దంపతులు దత్తత మార్గం కాకుండా ఇతర మార్గాల సంతానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఇది విజయవంతమైన ప్రక్రియ అని అంతా భావిస్తూ వచ్చారు. కానీ ఇటీవలి పరిణామాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. తమ అనుకున్న సంతానం పరాయి వాళ్లు అని తేలుతుండడం జీర్ణించుకోలేకపోతున్నారు.సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటన మరువకముందే మేడ్చల్ జిల్లాలో మరో అక్రమ సరోగసీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కమర్షియల్ సరోగసీ, అక్రమ అండాల వ్యాపారం చేస్తున్న ఏడుగురు మహిళలు, ఓ పురుషుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.పోలీసుల దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, నిందితులు పేదింటి యువతులను లక్ష్యంగా చేసుకుని వారిని సరోగసీ, అండాల దానం చేయడానికి ప్రలోభపెడుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. . వారికి కేవలం నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చి, సరోగసీ ద్వారా పిల్లలు కనిపించుకునే తల్లిదండ్రుల నుంచి మాత్రం రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తేలింది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మి (45), ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి (23) కీలకంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు తెలిపారు.

**జైలు శిక్ష పడినా మారని తీరు..**

లక్ష్మి గతంలో ముంబైలో పిల్లల అమ్మకం, అక్రమ సరోగసీ కేసులో అరెస్టయి జైలు కెళ్లారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష కూడా అనుభవించారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా తన వైఖరి మార్చుకోకుండా మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత తన కుమారుడు, కూతురుతో కలిసి పాత పద్ధతిలోనే ఈ దందాను కొనసాగించినట్లు దర్యాప్తులో బయటపడింది.

**ఏజెంట్ల ద్వారా వివరాలు..**

సోదాల్లో లక్ష్మి ఇంటి నుంచి ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, గర్భాధారణ మందులు, హార్మోన్ ఇంజక్షన్లు పెద్దఎత్తున స్వాధీనం చేశారు. అదనంగా, పలు ఐవీఎఫ్ సెంటర్లను ఆశ్రయించిన దంపతుల వివరాలను ఏజెంట్ల ద్వారా సేకరించిన ఆధారాలు కూడా లభించాయి.

**ఆ వైద్యశాలలతో సంబంధాలు..**

లక్ష్మి హెగ్డే హాస్పిటల్‌తో పాటు అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవీఎఫ్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వైద్యశాలలతో ఉన్న అనుబంధాలపై లోతుగా విచారణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

**చీకటి కోణాలపై మరింత దర్యాప్తు..**

ఇలాంటి అక్రమ సరోగసీ నెట్‌వర్క్‌లు పేద మహిళలను వలలో వేసుకుని తమ ప్రయోజనాల కోసం దోపిడీ చేస్తున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ కేసు వెనుక మరెన్ని చీకటి కోణాలు ఉన్నాయో అనే అనే దానిపైనా దర్యాప్తు సాగుతోంది.

# మహిళా పొలిటీషన్స్ కు 'ఆ రోజులు' పెద్ద సవాల్ : కంగనా రనౌత్



**హైదరాబాద్ పెన్ పవర్:**స్టార్ హీరోయిన్ బాలీవుడ్ ను ఏలిన కంగనా రనౌత్ రాజకీయాల్లోనూ రాణిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలి ఎన్నికల్లో ఎంపీగా గెలిచి తన సత్తా చాటారు బాలీవుడ్ క్వీన్ కంగనా. సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ సవాళ్లు ఎదుర్కొవడానికి సిద్ధపడుతుంటారు. ఇక తను చేసే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతుంటాయి. సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు కంగనా. మహిళా సాధికారత, సామాజిక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించే విషయం ఏ మాత్ర వెనుకాడరు. తాజాగా మహిళలు ఎదుర్కొనే ఒక సున్నితమైన సమస్యపై స్పందించారు కంగనా.

ఢిల్లీలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆమె రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాల గురించి వెల్లడించారు. మహిళలు పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత కాపాడుకోవడం, ముఖ్యంగా దీర్ఘకాల ప్రయాణాలు చేసే రాజకీయ నాయకురాలిగా ఉంటే ఎంత కష్టమో వివరించారు.

**"రాజకీయాల్లో లగ్జరీలు లేవు"**

"నటిగా ఉన్నప్పుడు షూటింగ్‌లో పూర్తి సౌకర్యాలు ఉండేవని చెప్పుకొచ్చారు. కారవ్యాన్లు, స్నానం చేసే సదుపాయాలు, కావలసినంత సౌలభ్యం ఉంటుందని వెల్లడించారు. కానీ రాజకీయ పర్యటనల్లో రోజుకు 12 గంటలకు పైగా బస్సుల్లో, రోడ్ల మీద ప్రయాణించాల్సి ఉంటుందని, మధ్యలో మరుగుదొడ్లు కూడా లభించవంటూ ఇబ్బందుల గురించి చెప్పుకొచ్చారు. ఇది తన సమస్య మాత్రమే కాదని, ఇతర మహిళా ఎంపీలకు కూడా పెద్ద సమస్యే" అని ఆమె చెప్పుకొచ్చారు.

**సంప్రదాయాలపై వ్యక్తిగత అనుభవం**

మహిళలు పీరియడ్స్ సమయంలో ఆలయాల్లోకి, వంటగదిలోకి వెళ్లరాదనే నమ్మకాలపై తన అనుభవాన్ని కూడా పంచుకున్నారు. "చిన్నప్పుడు నేను కూడా ఆ నియమాలు పాటించాను. అయితే నా తల్లి ఎప్పుడూ ఇది విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం అని చెప్పేది. ఆ రోజుల్లో నేను చాలా అసహనంగా ఉండేదాన్ని, ఏ పనిపట్ల ఆసక్తి ఉండేది కాదు. అందుకే వంట చేయకపోవడం, పనులు చేయకపోవడం మంచిదే" అని తెలిపారు.

**గ్రామీణ సమాజంలో ఇంకా మూఢనమ్మకాలే**

ఈ సందర్భంగా ఆమె గ్రామీణ ప్రాంతాల్లో పీరియడ్స్ చుట్టూ ఇంకా రహస్య భావజాలం, ఆధ్యాత్మిక అడ్డంకులు కొనసాగుతున్నాయని గమనించారు. "మహిళల శరీరంలో సహజంగా జరిగే ఈ ప్రక్రియను సమాజం అర్థం చేసుకోవాలి. ఈ సమయంలో మహిళలు విశ్రాంతి తీసుకునేలా వాతావరణం కల్పించాలి" అని కంగనా పిలుపునిచ్చారు.

**స్త్రీలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి..**

మహిళల మాసిక సమస్యలను ఓపెన్‌గా చర్చించడం ద్వారా సమాజం మార్పు దిశగా అడుగులు వేయగలదని కంగనా అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని పెద్ద ఎత్తున చర్చించేలా అవగాహన కార్యక్రమాలు జరగాలని ఆమె సూచించారు.

# ఈ సంకేతాలుంటే మీ గుండెకు ముప్పే.. ముందుగా మేలుకోండి



**హైదరాబాద్ పెన్ పవర్:**మన శరీరం లోపల ఏదైనా సమస్య ఉన్నప్పుడు అది బయటికి కొన్ని సూచనల రూపంలో సంకేతాలు ఇస్తుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యం బలహీనమైతే శరీరం ఇచ్చే చిన్న చిన్న మార్పులను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. గుండె సరిగా పనిచేయకపోతే రక్తప్రసరణలో ఆటంకాలు కలుగుతాయి. దీని ప్రభావం నేరుగా శ్వాస, అలసట, శరీర కదలికలపై పడుతుంది. వైద్య నిపుణుల సూచనల ప్రకారం గుండె బలహీనంగా ఉన్నప్పుడు కనిపించే కొన్ని ముఖ్య సంకేతాలు ఇవి.

**1. తరచూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది**

సాధారణ పనులు చేస్తున్నప్పటికీ శ్వాస ఆడకపోవడం, మెట్లు ఎక్కినప్పుడు లేదా నడిచినప్పుడు గాలి ఆడకపోవడం గుండె బలహీనత సంకేతం కావచ్చు.

**2. చేతులు, కాళ్ల వాపు**

గుండె బలహీనమై రక్తప్రసరణలో అంతరాయం కలిగితే శరీరంలోని ద్రవాలు నిల్వ అవుతాయి. దీంతో కాళ్లు, పాదాలు, చేతులు వాపు వస్తాయి.

**3. తరచూ అలసట**

చిన్న పనులు చేసినా శరీరం బలహీనంగా అనిపించడం, శక్తి తగ్గిపోవడం గుండె సరిగా పని చేయకపోవడానికి సూచన కావచ్చు.

**4. ఛాతిలో బరువు లేదా నొప్పి**

ఛాతీలో బరువుగా అనిపించడం, ఒత్తిడి కలగడం, కొన్నిసార్లు నొప్పి రావడం గుండె సంబంధిత సమస్యలకు సంకేతమని వైద్యులు చెబుతున్నారు.

**5. రాత్రి నిద్రలో ఇబ్బంది**

పడుకునే సమయంలో ఊపిరి ఆడకపోవడం, దగ్గు రావడం, నిద్ర లేచి కూర్చోవాల్సి రావడం గుండె బలహీనతను సూచిస్తుంది.

**6. గుండె వేగం అసాధారణంగా మారడం**

కొన్నిసార్లు గుండె వేగంగా కొట్టుకోవడం, కొన్నిసార్లు నెమ్మదిగా దడపడం వంటి పరిస్థితులు గుండె బలహీనంగా ఉన్నప్పుడు తరచూ కనిపిస్తాయి.

**ఎప్పుడు డాక్టర్‌ను సంప్రదించాలి?**

ఈ లక్షణాలు తరచుగా కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. గుండె బలహీనతను ప్రారంభ దశలో గుర్తిస్తే మందులు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా పరిస్థితిని నియంత్రించవచ్చు.

**జాగ్రత్తలుజి**

సరైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, మితమైన నిద్ర, మానసిక ఒత్తిడిని అధిగమించడం

# రష్యా, చైనా, భారత్ ఒక్కటైతే.. అమెరికాకు ప్రమాదమే..

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన విదేశీ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా భారతదేశంపై విధించిన వాణిజ్య సుంకాలు అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంత ప్రమాదకరమో ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలు రష్యా, చైనా, భారతదేశాలను ఒక కూటమిగా దగ్గర చేస్తాయని, ఇది అమెరికాకు భారీ నష్టం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు.

**-భారత్‌పై సుంకాల వెనుక కారణం**

రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న కారణంగా భారతదేశంపై అమెరికా 25 శాతం అదనపు సుంకం విధించింది. కానీ, రష్యా చమురును భారీగా కొనుగోలు చేస్తున్న చైనాపై మాత్రం ఎలాంటి సుంకాలూ విధించకపోవడంపై బోల్టన్ అన్యాయమని మండిపడ్డారు. ఈ పక్షపాత వైఖరి భారత్‌లో తీవ్ర అసంతృప్తికి కారణమైందని ఆయన వెల్లడించారు.

**-వ్యూహాత్మక ప్రమాదం: మోస్కో, బీజింగ్, ఢిల్లీ**

బోల్టన్ తన వ్యాఖ్యలలో ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించారు: "మాస్కో, బీజింగ్, ఢిల్లీ ఒక్కటైతే అమెరికాకు వ్యూహాత్మకంగా భారీ నష్టం జరుగుతుంది." భారత్‌పై సుంకాలు విధించడం వల్ల ఈ మూడు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని, ఇది ట్రంప్ ప్రభుత్వం చేసిన అతి పెద్ద పొరపాటని ఆయన అభిప్రాయపడ్డారు. రష్యా, చైనా, భారత్ మధ్య సంబంధాలు ఇప్పటికే అమెరికాకు ఆందోళన కలిగిస్తున్నాయని బోల్టన్ గుర్తు చేశారు. గతంలో పుతిన్ భారత్ పర్యటన, ప్రధాని మోదీ చైనా పర్యటనలు ఈ ఆందోళనలను మరింత పెంచాయని ఆయన పేర్కొన్నారు.

**-భవిష్యత్ సవాళ్లు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌ను సందర్శించనుండటం, అదే విధంగా ప్రధాని మోదీ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతుండటం వంటి పరిణామాలు అమెరికాకు కొత్త వ్యూహాత్మక సవాళ్లను సృష్టిస్తాయని బోల్టన్ స్పష్టం చేశారు.

ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు భారతదేశాన్ని అమెరికా నుంచి దూరం చేసి, చైనా-రష్యా వైపు మరింత దగ్గర చేసే అవకాశాలు ఉన్నాయని జాన్ బోల్టన్ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయాలు అమెరికా ప్రపంచ నాయకత్వానికి ప్రమాదకరమని ఆయన అన్నారు.

# పంత్ గాయం ఎఫెక్ట్: క్రికెట్‌లో కొత్త రూల్ తీసుకువచ్చిన బీసీసీఐ

- దేశవాళీ క్రికెట్‌లో బీసీసీఐ సరికొత్త నిబంధన
- తీవ్ర గాయాలైతే ఆటగాడిని మార్చుకునే అవకాశం
- అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా అమలు కాని నియమం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకోనుంది. ఇటీవల రిషభ్ పంత్ వంటి కీలక ఆటగాళ్లు తీవ్రంగా గాయపడి జట్టుకు దూరమవ్వడంతో, టీమ్‌లు నష్టపోకుండా ఉండేందుకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) ఒక కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. దీనిని 'సీరియస్ ఇంజ్యూరీ రీప్లేస్‌మెంట్'గా పిలుస్తున్నారు. ఈ నియమం 2025-26 దేశవాళీ సీజన్ నుంచి అమల్లోకి రానుంది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్‌లో భారత ఆటగాడు రిషభ్ పంత్ పాదానికి ఫ్రాక్చర్ కావడం, ఇంగ్లండ్ ఆటగాడు క్రిస్ వోక్స్ భుజం డిస్‌లొకేషన్‌కు గురికావడంతో ఇరు జట్లు 10 మందితోనే ఆడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకే ఈ కొత్త రూల్‌ను తీసుకొచ్చారు. ఇప్పటికే కంకషన్ (తల గాయం) కోసం రీప్లేస్‌మెంట్ నిబంధన ఉన్నప్పటికీ, ఇతర తీవ్ర గాయాలకు ఆ అవకాశం లేదు. ఆట మధ్యలో ఎవరైనా ఆటగాడు బంతి తగలడం వల్ల ఎముక విరగడం, తీవ్రమైన కోత లేదా కీలు స్థానభ్రంశం వంటి గాయాలపాలైతే, అతని స్థానంలో సమాన నైపుణ్యం ఉన్న మరో ఆటగాడిని తీసుకునేందుకు ఈ నిబంధన వీలు కల్పిస్తుంది. ఈ రీప్లేస్‌మెంట్‌కు మ్యాచ్ రిఫరీ తప్పనిసరిగా ఆమోదం తెలపాలి. గాయం తీవ్రతను నిర్ధారించడానికి ఆయన వైద్యులు, ఫీల్డ్ అంపైర్లతో చర్చిస్తారు. టాస్ సమయంలో ప్రకటించిన సబ్‌స్టిట్యూట్ జాబితా నుంచే ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ వికెట్ కీపర్ గాయపడి, జాబితాలో మరో కీపర్ లేకపోతే బయటి నుంచి కూడా అనుమతించే అవకాశం ఉంది. గాయపడిన ఆటగాడికి ఉన్న హెచ్చరికలు లేదా పెనాల్టీ సమయం కొత్తగా వచ్చిన ఆటగాడికి కూడా వర్తిస్తాయి.

**పరిమిత ఓవర్లకు వర్తించదు!**

ఈ కొత్త నిబంధన కేవలం సీకే నాయుడు ట్రోఫీ (అండర్-19)తో పాటు ఇతర మల్టీ-డే డొమెస్టిక్ టోర్నమెంట్‌లకు మాత్రమే వర్తిస్తుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వంటి పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు గానీ, ఐపీఎల్‌కు గానీ ఇది వర్తించదని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ నిబంధనను ఐసీసీ అంతర్జాతీయ స్థాయిలో అమలు చేయడం లేదు. అయితే, భారత దేశవాళీ క్రికెట్‌లో దీని ఫలితాలను బట్టి భవిష్యత్తులో టెస్ట్ క్రికెట్‌లోనూ ఇలాంటి మార్పులపై చర్చ జరిగే అవకాశం ఉంది.

# పాక్ క్రికెటర్లకు పీసీబీ షాక్.. జీతాల్లో భారీ కోతకు రంగం సిద్ధం

- పేలవ ప్రదర్శనతో పాక్ ఆటగాళ్లపై పీసీబీ ఆగ్రహం
- క్రికెటర్ల సెంట్రల్ కాంట్రాక్టుల్లో మార్పులకు యోచన
- ఐసీసీ ఆదాయంలో 3 శాతం వాటాను తొలగించే అవకాశం
- ఇటీవల వెస్టిండీస్ చేతిలో చరిత్రాత్మక ఓటమి ఎఫెక్ట్
- అన్ని ఫార్మాట్లలోనూ నిరాశపరుస్తున్న పాకిస్థాన్ జట్టు




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్‌లో పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. వరుస ఓటములతో నిరాశపరుస్తున్న బాబర్ అజామ్, మహమ్మద్ రిజ్వాన్ వంటి కీలక ఆటగాళ్ల జీతాల్లో కోత విధించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవలే వెస్టిండీస్ చేతిలో వన్డే సిరీస్‌ను ఘోరంగా కోల్పోవడం ఈ అంశానికి మరింత బలాన్నిచ్చింది. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రదర్శన అన్ని ఫార్మాట్లలోనూ అత్యంత దారుణంగా ఉంది. ఆడిన 11 వన్డే మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, మిగతా వాటిలో ఘోరంగా విఫలమైంది. ఇక టీ20ల విషయానికొస్తే, 14 మ్యాచ్‌లకు గానూ ఏడింటిలో గెలిచి, మరో ఏడింటిలో ఓటమి పాలైంది. టెస్టుల్లోనూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసింది. ఈ గణాంకాలు జట్టు ఆటతీరుకు అద్దం పడుతున్నాయి. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలోనే ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. 1991 తర్వాత విండీస్ చేతిలో పాక్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే ప్రథమం. చివరి వన్డేలో ఏకంగా 202 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం జట్టును తీవ్రంగా దెబ్బతీసింది.

ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి ఒక కీలక నిబంధనను తొలగించాలని పీసీబీ భావిస్తున్నట్టు 'క్రికెట్ పాకిస్థాన్' నివేదిక వెల్లడించింది. రెండేళ్ల క్రితం సీనియర్ ఆటగాళ్ల ఒత్తిడి మేరకు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నుంచి వచ్చే ఆదాయంలో 3 శాతం వాటాను ఆటగాళ్లకు ఇచ్చేలా పీసీబీ అంగీకరించింది. ప్రస్తుతం ఈ నిబంధనను కాంట్రాక్టుల నుంచి తొలగించాలని బోర్డు నిర్ణయించినట్లు సమాచారం. కొన్ని చట్టపరమైన చిక్కుల వల్ల ఈ ఏర్పాటును వెంటనే రద్దు చేయలేకపోయినా, రాబోయే కొత్త కాంట్రాక్టులలో ఈ నిబంధనను చివరిసారిగా చేర్చి, ఆ తర్వాత పూర్తిగా ఎత్తివేయాలని పీసీబీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఆ దెబ్బకు అఫ్రిది నోరు మూశాడు: ఇర్ఫాన్ పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది నోటి దురుసు ఇప్పుడే కాదు.. అతడు ఆడే రోజుల్లోనూ ఎక్కువే. దాంతో ఇర్ఫాన్ పఠాన్‌కూ ఓసారి చేదు అనుభవం ఎదురైంది. వెంటనే కౌంటర్ ఎటాక్‌తో అఫ్రిదికి ఇర్ఫాన్ సరైన గుణపాఠం చెప్పాడు. 2006లో పాక్ పర్యటనకు వెళ్లినప్పుడు జరిగిన ఆ సంఘటనను ఇర్ఫాన్ గుర్తు చేసుకున్నాడు. అఫ్రిది కాస్త పరుషంగా మాట్లాడేందుకు ప్రయత్నించాడని.. తాను కూడా తగ్గకపోవడంతో సైలెంట్ అయిపోయాడని తెలిపాడు."మేం 2006లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లాం. అప్పుడు ఇరు జట్ల ఆటగాళ్లు కరాచీ నుంచి లాహోర్‌కు ఒకే ఫ్లైట్‌లో ప్రయాణించాం. నా సీట్‌లో కూర్చొని ఉండగా అఫ్రిది వచ్చాడు. నా తలపై చేయి వేసి నిమురుతూ.. 'ఎలా ఉన్నావు బాబు?' అన్నాడు. 'నువ్వెప్పుడు నాకు తండ్రిగా మారావు?' అని ప్రశ్నించా. అతడివి పిల్ల చేష్టలు. నాకు స్నేహితుడు కూడా కాదు. ఆ తర్వాత కొన్ని అసభ్యకర పదాలు వాడాడు. నాకు కాస్త పక్కనే అతడి సీట్. మరోవైపు అబ్దుల్ రజాక్ సీట్‌లో ఉన్నాడు. అప్పుడు రజాక్‌ను 'ఇక్కడ ఏ మాంసం దొరుకుతుంది' అని అడిగా. కొన్ని రకాలను అతడు చెప్పాడు. వెంటనే ఇక్కడ కుక్క మాంసం దొరుకుతుందా? అని ప్రశ్నించా. రజాక్‌తోపాటు అటువైపుగా ఉన్న అఫ్రిది కూడా షాక్ అయ్యాడు. 'హే ఇర్ఫాన్, ఎందుకు అలా అన్నావు?' అని రజాక్ అడిగాడు. అప్పుడు నేను అన్న మాటలకు అఫ్రిది సైలెంట్ అయిపోయాడు. 'ఏం లేదు. అఫ్రిది కుక్క మాంసం తిన్నాడేమో.. చాలా సమయం నుంచి మొరుగుతూనే ఉన్నాడు' అని అనడంతో అఫ్రిది కాసేపు మారుమాట్లాడలేదు. తర్వాత ఏమన్నా సరే.. ఇదిగో అతడు అరుస్తున్నాడంటూ కామెంట్ చేసేవాడిని. ఆ సంఘటన నుంచి ఇంకెప్పుడూ నాతో మాటల యుద్ధం పెట్టుకోకూడదని అఫ్రిది భావించాడు" అని ఇర్ఫాన్ వివరించాడు.

క్లాసిక్ చీరలో రాశి ఖన్నా చంపేసింది



# డివోషనల్ బ్యాక్ డ్రాప్ లో మరో భారీ సినిమా




గత కొన్నాళ్లుగా ఇండియన్ సినిమాలో పురాణాలకు, డివోషనల్ కు సంబంధించిన కథలపై ఎక్కువ సినిమాలొస్తున్నాయి. సినిమాలు రావడమే కాదు, వాటికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ కూడా దక్కుతుంది. అందుకే పురాణాల ఆధారంగా లేదా దేవుడి కథలపై సినిమాలు తీయాలని అందరికీ ఆసక్తి ఏర్పడుతుంది. ఇప్పటికే ఈ నేపథ్యంలో పలు దేవుళ్లపై సినిమాలు రాగా, ఇప్పుడు మరో సినిమా రెడీ అవుతోంది. ఢిల్లీకి చెందిన ప్రముఖ బోధకుడు జితామిత్ర ప్రభుశ్రీ ఆశీస్సులతో ఓ భారీ సినిమా రూపొందుతుంది. శ్రీజీ ఎంటర్టైన్మెంట్స్, అభయ్ చరణ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మహాకావ్యానికి సంబంధించిన టైటిల్ ను తాజాగా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను అనిల్ వ్యాస్ నిర్మిస్తున్నారు.

**పాన్ వరల్డ్ మూవీగా..**

11-12 శతాబ్దాల కాలం నాటి మహోబా వైభవాన్ని, శ్రీకృష్ణుడి ఆధ్యాత్మికతను, ధీరత్వాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. శ్రీకృష్ణుడిని ఓ యుద్ధ వీరుడిగా చూపిస్తూ వస్తోన్న మొదటి సినిమాగా ఇది చరిత్రకెక్కుతోంది. ఈ సినిమాకు ముకుంద్ పాండే దర్శకత్వం వహిస్తుండగా, దీన్ని భారీ బడ్జెట్ తో ఓ పాన్ వరల్డ్ మూవీగా తీర్చిదిద్దాలని దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. టైటిల్ ను అనౌన్స్ చేస్తూ మేకర్స్ ఓ చిన్న పోస్టర్ ను రిలీజ్ చేయడంతో పాటూ పలు విషయాలను వెల్లడించారు. త్వరలోనే ఈ సినిమాలో ఎవరెవరు భాగం కానున్నారు? ఏ పాత్రలో ఎవరు కనిపించనున్నారనే విషయాలు కూడా అనౌన్స్ కానున్నాయి. మరి పురాణాల కాలం నాటి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టు ఆడియన్స్ ను ఏ మేర ఆకట్టుకుంటుందో చూడాలి.

స్కై-బ్లూలో సారా అలీ ఖాన్ లక్ష్మీ మూమెంట్స్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com